

మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట

వార్త


## పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించేలా విధులు నిర్వర్తించాలి

### రాష్ట్ర మునిసిపల్ కమిషనర్ శ్రీదేవి

**సంగారెడ్డి మున్సిపాలిటీ, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త:** మున్సిపాలిటీ ఎన్నికల నేపథ్యంలో సంగారెడ్డి, ఇస్నాపూర్ మున్సిపాలిటీల్లో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్లను మంగళవారం రాష్ట్ర మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్ టి.కె.శ్రీదేవి పరిశీలించారు. ఎన్నికల సామాగ్రి పంపిణీ తీరును కమిషనర్ ప్రత్యక్షంగా పర్యవేక్షించారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే ప్రతి ఒక్కరు బాధ్యతతో వ్యవహరించాలని సూచించారు. ఎన్నికలు పారదర్శకంగా, స్వేచ్ఛాయుతంగా జరిగేలా విధులు నిర్వర్తించాలని పోలింగ్ ప్రెసైడింగ్ అధికారులకు సూచించారు. వారు నిర్వహించాల్సిన విధులు,చేయాల్సిన ఏర్పాట్ల వంటి అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శ్రీదేవిని, జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. జిల్లాలో నిష్పాకిక ఎన్నికల నిర్వహణ కోసం చేబట్టిన సమగ్ర ఏర్పాట్లపై కలెక్టర్, కమిషనర్‌కు వివరాలు వివరించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ పాండు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

## ఎన్నికల్లో బందోబస్తు పకడ్బందీగా నిర్వహించాలి : డిఎస్పి

**నర్సాపూర్, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త:** నేడు(బుధవారం) నర్సాపూర్‌లో జరగనున్న మున్సిపల్ ఎన్నికలను ప్రశాంతంగా సజావుగా జరిగేందుకు పోలీసు సిబ్బంది బందోబస్తును పకడ్బందిగా నిర్వహించాలని తూప్రాన్ డిఎస్పి నరేందర్‌గౌడ్ సూచించారు. మంగళవారం బివిఆర్ఐటి ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్నికల విధులపై బందో బస్తుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డిఎస్పి నరేందర్ గౌడ్ మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికల పోలింగ్ కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి బందోబస్తుచేయాలన్నారు. ఎన్నికల నిబంధనలను ఎవరైనా అతిక్రమించిన సహించేది లేదన్నారు. ఎన్నికల నిబంధన ప్రకారం నాయకులు ప్రజలు నడుచుకోవాలన్నారు. ఈ ఎన్నికలకు నాయకులు ప్రజలు సహకరించి ఎన్నికలను ప్రశాంతంగా సజావుగా జరిగే విధంగా చూడాలన్నారు. ఇందుకు ప్రజలందరూ సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా బందోబస్తు సిబ్బందికి ఎన్నికల విధులు, తీసుకోవలసిన జాగ్రత్తలపై డీఎస్పీ నరేందర్ గౌడ్ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఆర్‌డిఎస్‌పి, నర్సాపూర్ సిఐ జాన్‌రెడ్డి, ఎస్సై రంజిత్ కుమార్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు



మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

## ప్రజలు ఓటుహక్కును వినియోగించుకోవాలి

### రవాణ, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

**హుస్నాబాద్ రూరల్, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త :** ప్రజాస్వామ్యంలో ఓటు హక్కే పెద్ద ఆయుధం అని, ప్రజలు తప్పక ఓటు హక్కును వినియోగించుకోవాలని రవాణా, బిసి సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మంగళవారం క్యాంప్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటుహక్కు ఎంతో కీలకమని, అది ప్రతి పౌరుడి చేతిలో ఉన్న గొప్ప ఆయుధమని ఇటీవల జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో గ్రామీణ ప్రాంతాల్లో 90 శాతం మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకుంటున్నారని, అదేవిధంగా పట్టణ ప్రాంత ప్రజలు మున్సిపల్ ఎన్నికల్లో ఓటు వేయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ నాయకుడిగా, మంత్రిగా పంచాయతీరాజ్, మున్సిపల్ చట్టాలను గౌరవిస్తూ పట్టణాలను ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేస్తున్నామని, తాగునీటి సరఫరా, డ్రైనేజీ వ్యవస్థ, స్ట్రీట్ లైట్స్, శానిటేషన్, వేస్ట్ మేనేజ్‌మెంట్ వంటి అంశాలపై ప్రభుత్వం సమగ్ర ఆలోచనతో పనిచేస్తోందన్నారు. పది సంవత్సరాల బిఆర్ఎస్ పాలనలో ఒక్క డబుల్ బెడ్‌రూం ఇల్లు ఇవ్వలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. రెండేళ్లలో రాష్ట్రంలో ఎంతో అభివృద్ధి జరిగిందని, రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ మున్సిపాలిటీలకు ప్రత్యేక నిధులు ఇవ్వలేదని, రాష్ట్రానికి రావాల్సిన నిధులు విడుదల చేయడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి, మంత్రులు అనేకసార్లు కేంద్ర ప్రభుత్వాన్ని కలిసినా తెలంగాణ పట్ల నిరక్ష్యంగా వ్యవహరిస్తోందని, వివక్ష చూపుతోందని ఆరోపించారు. హుస్నాబాద్ అభివృద్ధి ప్రజల కళ్లముందే జరుగుతోందని, అధికారంలో ఉన్న పార్టీకి అవకాశం ఇస్తే మరింత అభివృద్ధి సాధ్యమవుతుందని స్పష్టం చేస్తూ, మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

## నిబంధనలు ఉల్లంఘించిన మంత్రిపై చర్యలు తీసుకోండి

### ఎన్నికల అధికారికి బిజెపి నాయకుల ఫిర్యాదు



ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేస్తున్న బిజెపి నాయకులు

**హుస్నాబాద్ రూరల్, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త :** ఎన్నికల నిబంధనలను అతిక్రమిస్తూ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రచారంలో పాల్గొంటున్నారని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కోమటిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి మంగళవారం పార్టీ శ్రేణులతో కలిసి ఎన్నికల అధికారి టి.మల్లిఖార్జున్‌గౌడ్‌కు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదులో ఎన్నికల నియమావళి అమల్లో ఉన్న సమయంలో మంత్రి ప్రచారం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమమన్నారు. ప్రభుత్వ గడువు ముగిసిన తర్వాత మంగళవారం అధికార దుర్వినియోగం చేస్తూ పొన్నం ప్రభాకర్ ఎన్నికల ప్రచారంలో పాల్గొనడం ద్వారా ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించారని ఆరోపించారు. ఈ విషయంలో ఎన్నికల సంఘం వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎన్నికలు నిస్పక్షపాతంగా, స్వేచ్ఛగా జరగాలంటే ఎన్నికల సంఘం కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని సూచించారు. హుస్నాబాద్ మున్సిపల్ ఎన్నికల్లో అధికార పార్టీ అభ్యర్థులకు మద్దతుగా మంత్రి ప్రచారం చేయడం ఎన్నికల నియమావళికి స్పష్టమైన ఉల్లంఘన స్పష్టం చేశారు. వెంటనే మంత్రిని ప్రచారానికి దూరంగా ఉంచాలని, లేదంటే న్యాయపరమైన చర్యలకు వెళ్తామని హెచ్చరించారు. విషయంపై జిల్లాఎన్నికల అధికారులకు ఫిర్యాదుచేస్తామని తెలిపారు.

## మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డిపై కేసు నమోదు

**సదాశివపేట, ఫిబ్రవరి 10(ప్రభాతవార్త):** ఎన్నికల కోడ్ ఉల్లంఘించినందుకు కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ జయప్రకాష్‌రెడ్డి(జగ్గారెడ్డి)పై కేసు నమోదైంది. మంగళవారం 10.30 గంటలకు మున్సిపల్ ఎలక్షన్‌కు చెందిన సదాశివపేట్ ఎఫ్‌ఎస్‌టీ టీమ్‌కు జయప్రకాష్‌రెడ్డి, మరి కొంతమంది సదాశివపేట్ బస్‌స్టాప్ ఎదుట హోటల్ దగ్గర వుండి జగ్గారెడ్డి డబ్బులు పంచుతున్నరాని సమాచారం రాగా, వెంటనే ఎఫ్‌ఎస్‌టీ టీమ్ అక్కడికి వెళ్లి చెక్ చేయగా అక్కడ జయప్రకాష్‌రెడ్డి వున్నారు. కానీ ఎవరికి డబ్బులు పంచడం లేదు. అయితే ఎన్నికల నియమావళి ప్రకారం 48 గంటల పోలింగ్ ముందు వేరేప్రాంతానికి చెందిన రాజకీయ వ్యక్తులు ఇంకొక ప్రాంతంలో ఉండకూడదు. ఎన్నికల నియమావళి ఉల్లగించినందుకు జగ్గారెడ్డిపై సదాశివపేట్ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు చేశారు.

## అర్బన్ పార్క్‌ను సందర్శించిన జపాన్ బృందం

**నర్సాపూర్, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త:** పట్టణ సమీపంలో ఉన్న అర్బన్ పార్క్‌ను మంగళవారం జపాన్ దేశానికి చెందిన జేఐసిఏ మెంబర్స్ సిమోజి హిటోమి, అసిస్టెంట్ డైరెక్టర్ సిద్ధార్థ్ సందర్శించి నర్సాపూర్ అటవీ పునరుద్ధరణ కోసం జరిగిన వివిధ పనులను పరిశీలించారు ఈ సందర్భంగా రాజన్న, సిరిసిల్ల సర్కిల్ సీఎం అర్పణ, మెదక్ డిఎఫ్ఓ జోజిలు అటవీ శాఖ ద్వారా చేపట్టిన పనులను వారికి వివరించారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ దివ్య ,రేంజ్ ఆఫీసర్ సిద్దిరాం సింగ్, సెక్షన్ ఆఫీసర్ సాయిరాం, బీట్ ఆఫీసర్ భూపాల్‌రెడ్డి పాల్గొన్నారు.



అర్బన్‌పార్క్‌ను సందర్శించిన జపాన్ బృందంతో అటవీ అధికారులు

# నేడే మున్సిపల్ పోలింగ్

### బ్యాలెట్ పేపర్లు, బాక్స్‌లతో పోలింగ్ స్టేషన్లకు తరలివెళ్లిన ఎన్నికల సిబ్బంది
### ఓటు హక్కు వినియోగించుకోనున్న 1 లక్ష 1 వేయి, 85 మంది ఓటర్లు

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**
జిల్లాలోని హుస్నాబాద్, చేర్యాల, దుబ్బాక, గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలకు నేడు(బుధవారం) ఎన్నికలు జరగనున్నాయి. పోలింగ్ ప్రక్రియకు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె.హైమావతి, ఆయా మున్సిపల్ కమిషనర్ల ఆధ్వర్యంలో సర్వం సిద్ధం చేశారు. ఆయా మున్సిపాలిటీల పరిధిలో మంగళవారం ఎన్నికల అధికారులకు, సిబ్బందికి పోలింగ్ సామాగ్రి బ్యాలెట్ పేపర్లు, బ్యాలెట్ బాక్సులను ఇతర సామాగ్రిని పంపిణీ చేశారు. నాలుగు మున్సిపాలిటీల్లో 72 వార్డులకు ఎన్నికలు నిర్వహించడానికి అవసరమైన ఏర్పాట్లు చేశారు. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటలకు వరకు పోలింగ్ జరగనుంది. 72 వార్డులకు 176 పోలింగ్ బూత్‌లు ఏర్పాటుచేశారు. ఆయా మున్సిపాలిటీలో నిర్వహించే పోలింగ్‌లో 1లక్ష 1 వెయి 85 మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. 18 రూట్లను 22 మంది జోనల్ అధికారులను నియమించారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ చేయనున్నారు. 31 క్రిటికల్ పోలింగ్ కేంద్రాలను గుర్తించి 31 మంది మైక్రో పరిశీలకులను క్రిటికల్ పోలింగ్ కేంద్రాలలో ఏర్పాటు చేశారు.ప్రతి పోలింగ్ బూత్‌కు ఒక ప్రెసైడింగ్ అధికారి, ఒక అసిస్టెంట్ ప్రెసైడింగ్ అధికారి, ఒక ఎపిను నియమించారు. బ్యాలెట్ పత్రాల ద్వారానే ఎన్నికలు నిర్వహిస్తున్నారు. 72 వార్డులకు గానూ 323 మంది అభ్యర్థులు తలపడుతున్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద వృద్ధులకు, వికలాంగులకు వీల్‌చైర్లు ఏర్పాటు చేశారు. 1069 మంది సిబ్బంది ఎన్నికల విధులు నిర్వహించనున్నారు.



పోలింగ్ సామాగ్రి పంపిణీని పరిశీలిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హైమావతి

**పోలింగ్ సామాగ్రి పంపిణీని కలెక్టర్ హైమావతి**
జిల్లాలోని ఆయా మున్సిపాలిటీలో పోలింగ్ సామాగ్రి పంపిణీ తీరును జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హైమావతి పరిశీలించారు. దుబ్బాక మున్సిపల్‌పరిధిలోని లచ్చపేట తెలంగాణ మోడల్ స్కూల్, జూనియర్ కళాశాలలో పోలింగ్ సామాగ్రి పంపిణీ తీరును జిల్లా మున్సిపల్ ఎన్నికల సాధారణ పరిశీలకులు అయేషా మాస్రత్‌ఖానంతో కలిసి క్షేత్ర స్థాయిలో పరిశీలించారు.

**నిఘా నీడలో ఎన్నికలు...**
జిల్లాలో మున్సిపల్ ఎన్నికలను నిఘా నీడలో నిర్వహించడానికి అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. జిల్లాలోని ఆయా మున్సిపాలిటీలలో 31 కేంద్రాలను సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలుగా గుర్తించారు. పోలింగ్ కేంద్రాలలో వెబ్ క్యాస్టింగ్ అమలు చేస్తున్నారు.

# పోలింగ్ ప్రశాంతంగా జరగాలి

### పోలింగ్ సిబ్బందికి ఎలాంటి ఇబ్బంది కలగకూడదు.. మెదక్ జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి రాహుల్ రాజ్

**మెదక్ టౌన్ ఫిబ్రవరి 10, ప్రభాతవార్త:**
మున్సిపల్ ఎన్నికల పోలింగ్ నిర్వహణ కోసం సిబ్బందికి ఎన్నికల సామాగ్రి పంపిణీ నిమిత్తం మెదక్ జిల్లా కేంద్రంలోని వెస్లీ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మంగళవారం సందర్శించారు. ఎలాంటి లోటుపాట్లు, గందరగోళానికి తావు లేకుండా సిబ్బందికి పోలింగ్ సామాగ్రిని పక్కాగా అందించాలని, చెక్‌లిస్టు ఆధారంగా ఎన్నికల నిర్వహణకు అవసరమైన సామాగ్రి అందిందా, లేదా అన్నది జాగ్రత్తగా పరిశీలించుకోవాలని కలెక్టర్ హితవు పలికారు. సకాలంలో నిర్దేశిత పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది చేరుకునేలా పర్యవేక్షణ జరపాలని అధికారులను ఆదేశించారు. పోలింగ్ సామాగ్రి, ప్రత్యేకించి బ్యాలెట్‌పేపర్లు తరలించే సమయంలో తప్పనిసరిగా సాయుధ పోలీసులతో కూడిన బందోబస్తు ఉండాలని చెప్పారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా వెంటనే తమ దృష్టికి తేవాలని సూచించారు.స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ హాళ్లను సైతం పరిశీలించిన కలెక్టర్, సిసిటివిలు ఏర్పాటుచేయాలని, ఒక్క సెకను కూడా విద్యుత్ అంతరాయం ఏర్పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తుగానే అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని, సకాలంలో ఓట్ల లెక్కింపు పూర్తి చేయాలని తెలిపారు. పోలింగ్ కేంద్రాలలో దివ్యాంగులకు ర్యాంపులు, వీల్‌చైర్లు అందుబాటులో ఉండాలని చెప్పారు. సదుపాయాల కల్పన విషయమై అధికారులకు పలు సూచనలు చేశారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని వసతులు అందుబాటులో ఉండాలని, ప్రశాంత వాతావరణంలో సజావుగా ఎన్నికలు జరిగేలా కృషి చేయాలన్నారు. అనవసర తప్పిదాలకు తావిస్తే కఠిన చర్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. దీనిని దృష్టిలో పెట్టుకుని అప్రమత్తతో ఎన్నికల విధులు నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో మెదక్ ఆర్డీవో రమాదేవి, తహసీల్దార్ లక్ష్మణ్‌బాబు, మున్సి పల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.





ఎన్నికల సామాగ్రి పంపిణీ కేంద్రాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

# ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చూడాలి

### సంగారెడ్డి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రావీణ్య... డిస్ట్రిబ్యూషన్ సెంటర్లను సందర్శించిన ప్రావీణ్య

**జహీరాబాద్, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త:**
ఈ నెల 11న జరగనున్న మున్సిపల్ ఎన్నికలు ప్రశాంతంగా ముగిసేలా ప్రతి ఒక్క అధికారి బాధ్యతగా విధులను నిర్వహించాలని జిల్లా కలెక్టర్ పి ప్రావీణ్య సూచించారు.మంగళవారం కోహీర్ మున్సిపాలిటీ ఎన్నికలను పురస్కరించుకుని కోహీర్‌లో ఏర్పాటు చేసిన ఎన్నికల సామాగ్రి డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సందర్శించి ఎన్నికల సామాగ్రిని పరిశీలించారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల్లో పోలింగ్ సిబ్బందికి అన్నిరకాల సౌకర్యాలు ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల సామాగ్రిని ఎన్నికల సిబ్బందికి అందేలా చూడాలని మున్సిపల్ కమిషనర్లకు కలెక్టర్ సూచించారు. పోలింగ్ కేంద్రాల వద్ద బందోబస్తు నిర్వహించే పోలీసు సిబ్బందిని తరలించేందుకు ఏర్పాటు చేసిన వాహనాలను కలెక్టర్ పరిశీలించారు. బ్యాలెట్ పేపర్లు తరలించే సమయంలో సాయుధ పోలీసులతో బందోబస్తు ఉండాలన్నారు. సమస్యలు ఉత్పన్నమయితే వెంటనే తన దృష్టికి తేవాలని అధికారులను, పోలీసులను కలెక్టర్ ఆదేశించారు. కలెక్టర్ వెంట ఆర్‌డిఓ దేవుజా, మున్సిపల్ కమిషనర్, తహసీల్దార్ ఉన్నారు.

**పోలింగ్ సిబ్బందికి ఎన్నికల సామాగ్రి అందించాలి...**
**సంగారెడ్డి మున్సిపాలిటీ, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త**
జిల్లాలో ఈనెల 11న జరగనున్న మున్సిపల్ ఎన్నికలను పురస్కరించుకుని పోలింగ్ నిర్వహణ కోసం సిబ్బందికి ఎన్నికలసామాగ్రి పంపిణీ నిమిత్తం ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్లను, స్ట్రాంగ్ రూమ్‌లను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి. ప్రావీణ్య సందర్శించారు. మంగళవారం కలెక్టర్ కోహీర్, సదాశివపేటలలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసినడిస్ట్రిబ్యూషన్ సెంటర్లలో ఎన్నికల సామాగ్రి పంపిణీ తీరును క్షేత్రస్థాయిలో కలెక్టర్ పరిశీలించారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలలో అందుబాటులో ఉన్న సదుపాయాలను పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. డిస్ట్రిబ్యూషన్ సెంటర్లలో పోలింగ్ సిబ్బందికి తాగునీటి వసతి, వైద్య శిబిరం, అల్పాహారం, భోజన వసతి, షామియానాలు, ఇతర అన్ని వసతులు ఏర్పాటు చేసారు. పిఒ, ఓపిఓలతో కూడిన బృందాలన్నీ హాజరయ్యారా లేదా అని కలెక్టర్ ఆరా తీయడంతోపాటు హాజరు నివేదికను పరిశీలించారు.ఎన్నికల పోలింగ్ సామాగ్రిని, బ్యాలెట్ బాక్స్‌లను పరిశీలించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,ఎలాంటి లోటుపాట్లు, గందరగోళానికి తావు లేకుండా సిబ్బందికి పోలింగ్ సామాగ్రిని పక్కాగా అందించాలని మున్సిపల్ కమిషనర్లకు సూచించారు. చెక్‌లిస్టు ఆధారంగా ఎన్నికల నిర్వహణకు అవసరమైన సామాగ్రి అందినదా, లేదా అన్నది జాగ్రత్తగా పోలింగ్ అధికారులు పరిశీలించుకోవాలని పోలింగ్ బృందాలకు కలెక్టర్ సూచించారు.

పోలింగ్ సిబ్బంది తోపాటు ఓటింగ్ కేంద్రాల వద్ద బందోబస్తు నిర్వహించే పోలీసు సిబ్బందిని తరలించేందుకు సిద్ధంగా ఉంచిన వాహనాలను పరిశీలించి, సకాలంలో నిర్దేశిత పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది చేరుకునేలా పర్యవేక్షణ జరపాలని అధికారులకు ఆదేశించారు.పోలింగ్ సామాగ్రి, ప్రత్యేకించి బ్యాలెట్ పేపర్లు తర లించే సమయంలో తప్పనిసరిగా సాయుధ పోలీసు లతోకూడిన బందోబస్తు ఉండాలని చెప్పారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా వెంటనే తమ దృష్టికి తీసుకు రావాలని ఆర్‌ఓలకు సూచించారు.అనంతరం ఆయా మున్సిపాలిటీలకు సంబంధించిన స్ట్రాంగ్ రూము లను పరిశీలించి పలు సూచనలు చేశారు.కలెక్టర్ వెంట రెవెన్యూ డివిజనల్ అధికారి దేవుజా, మున్సి పల్ కమిషనర్, తహసిల్దార్, తదితరులు ఉన్నారు.



డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను సందర్శించిన జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

## పోలింగ్‌కు సర్వం సిద్ధం..

### ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
### నేడు జిల్లాలోని 11 మున్సిపాలిటీల్లో పోలింగ్

**సంగారెడ్డి బ్యూరో, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త :**
సంగారెడ్డి జిల్లాలోని 11 మున్సిపాలిటీల్లో ఈ నెల 11న(బుధవారం) నిర్వహించనున్న ఎన్నికల పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఓటర్లు ప్రశాంత వాతావరణంలో, స్వేచ్ఛగా ఓటుహక్కును వినియోగించుకునేలా అన్నిస్థాయిల్లో ఏర్పాట్లు చేపట్టారు. ఈ ఎన్నికలు సంగారెడ్డి, సదాశివపేట, కోహీర్, జహీరాబాద్, నారాయణఖేడ్, జిన్నారం, ఆందోల్-జోగిపేట్, ఇస్నాపూర్, ఇంద్రేశం, గుమ్మడిదల, గడ్డపోతారం మున్సిపాలిటీలలో జరగనున్నాయి. జిల్లాలోని 11 మున్సిపాలిటీల్లో మొత్తం 256 వార్డులు ఉండగా 541 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు చేసారు. మొత్తం 3,41,808 మంది ఓటర్లు ఎన్నికల్లో పాల్గొననున్నారు. వారిలో పురుషులు- 1,71,151, మహిళలు -1,70,638 ఇతరులు - 19. మున్సిపాలిటీ వారీగా ఓటర్ల వివరాలు... ఆందోల్-జోగిపేట్ : 20 వార్డులు, 32 పోలింగ్ కేంద్రాలు 16,450 మంది ఓటర్లు, గడ్డపోతారం : 18 వార్డులు 18 పోలింగ్ కేంద్రాలు 11,983 ఓటర్లు, గుమ్మడిదల : 22 వార్డులు 44 పోలింగ్ కేంద్రాలు 23,926 ఓటర్లు. ఇంద్రేశం: 18 వార్డులు 19 పోలింగ్ కేంద్రాలు 13,086 ఓటర్లు. ఇస్నాపూర్ : 26 వార్డులు 60 పోలింగ్ కేంద్రాలు 35,912 ఓటర్లు, జిన్నారం : 20 వార్డులు 22 పోలింగ్ కేంద్రాలు 12,473 ఓటర్లు, కోహీర్ : 16 వార్డులు 16 పోలింగ్ కేంద్రాలు 10,832 ఓటర్లు. నారాయణఖేడ్ : 15 వార్డులు, 30 పోలింగ్ కేంద్రాలు 17,675 ఓటర్లు, సదాశివపేట : 26 వార్డులు, 58 పోలింగ్ కేంద్రాలు 36,982 ఓటర్లు, సంగారెడ్డి : 38 వార్డులు, 121 పోలింగ్ కేంద్రాలు 83,668 ఓటర్లు, జహీరాబాద్ : 37 వార్డులు 121 పోలింగ్ కేంద్రాలు 78,819 ఓటర్లు ఉన్నారు. పోలింగ్ నిర్వహణ కోసం జిల్లాలో 103 మంది రిటర్నింగ్ అధికారులు,103 మంది అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు, 649 మంది ప్రిసైడింగ్ అధికారులు, 649 మంది అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు, 1,948 మంది ఇతర పోలింగ్ అధికారులు, 73 మంది మైక్రో అబ్జర్వర్లు, 49 మంది జోనల్ ఆఫీసర్లను నియమించారు. ప్రశాంతంగా, సురక్షితంగా పోలింగ్ జరిగేలా శాంతిభద్రతలు కట్టుదిట్టంగా ఉండేలా ఏర్పాట్లు చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద అవసరమైన మౌలిక వసతులు కల్పించి, ఓటర్లకు అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకున్నారు.

## నిరంతర విద్యుత్ సరఫరాకు

### టిజిఎస్‌పిడిసిఎల్ సిద్ధం : చీఫ్ ఇంజనీర్



విద్యుత్ స్టోర్ల నుతనిఖీచేస్తున్న చీఫ్‌ఇంజనీర్ ప్రతిమా షోమేను

**సిద్దిపేట రూరలన, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త :** వచ్చే వేసవి కాలంలో పెరుగుతున్న విద్యుత్ అవసరాలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు టిజిఎస్‌పిడిసిఎల్ పూర్తిస్థాయిలో సిద్దంగా ఉందని టిజిఎస్‌పిడిసిఎల్ చీఫ్ ఇంజనీర్(ప్రాజెక్టు) ప్రతిమా షోమేను తెలిపారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని విద్యుత్ కార్యాలయంలో స్టోర్లలో సామాగ్రి ఆమె తనిఖీ చేశారు.కొత్త విద్యుత్ కనెక్షన్లు, వ్యవసాయ సేవల విడుదల 11 కెవి, 33 కెవి లైన్ పనులు కొత్త 33/11 కెవి సబ్‌స్టేషన్ పనులకు అవసరమైన ప్రధాన సామాగ్రి లభ్యతను సమీక్షించారు. కండక్టర్ల, డీటీఆర్లు,పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు, బ్రేకర్లు, ఏబీ స్విచ్‌లు,వీసీబీలు,కేబుల్స్ తతదితర కీలక సామాగ్రి సరిపడా నిల్వలో ఉన్నట్లు ఆమె తెలిపారు. అపరేషన్ అండన మెయింటెనెన్స్ పనులకు అవసరమైన సామాగ్రి భద్రతా పరికరాలు సమృద్ధిగా అందుబాటులో ఉన్నాయని ఎలాంటి కొరత లేదన్నారు. వచ్చే వేసవి పీక్ లోడ్ సమయంలో అన్ని వర్గాల వినియోగదారులకు నిరంతరం నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించేందుకు టిజిఎస్‌పిడిసిఎల్ పూర్తి స్థాయిలో సిద్దంగా ఉందన్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఇంజనీర్ డి.చంద్రశేఖర్, డివిజనల్ ఇంజనీర్(టెక్నికల్అండ్‌కన్స్ట్రక్షన్) జి.శ్రీనాథ్, డీఈ ఎంఆర్టీ కె.పండారి, ఎడిఈ స్టోర్స్ ఎం.సంతోష్‌కుమార్, ఎడిఈ కమర్షియల్ పి,ముత్తయ్య, ఏఈ అవుట్‌డోర్ స్టోర్స్ కె.శ్రీకాంత్, ఏఈ ఇండోర్ స్టోర్స్ కె.బాలకిషన్ తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ ఎన్నికలకు కట్టుదిట్టమైన భద్రతాచర్యలు

### సైబరాబాద్ సిపి రమేష్‌రెడ్డి





మాట్లాడుతున్న రమేష్‌రెడ్డి

**పటాన్‌చెరు, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త:** ఇంద్రేశం, ఇస్నాపూర్ మున్సిపల్ పరిధిలో బుధవారం జరగనున్న ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రత చర్యలు ఏర్పాటు చేస్తున్నట్లు సైబరాబాద్ సీపీ రమేష్ రెడ్డి తెలిపారు. మంగళవారం ఇస్నాపూర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మొత్తం 314 మంది సిబ్బంది, ఇద్దరు డీసీపీలు, ఇద్దరు ఏసీపీలు, 9 మంది సీఐలు, 24 మంది ఎస్ఐలు, సిబ్బంది విధులు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి జోన్ డీసీపీ చింతమనేని శ్రీనివాస్, రామచంద్రాపురం ఏసిపి శ్రీనివాస్ కుమార్, పటాన్ చెరు సీఐ వినాయక్ రెడ్డి, డీఐ రాజు, సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

## విధుల పట్ల నిర్లక్ష్యం వహించొద్దు

### సిపి రష్మీ పెరుమాళ్

**చేర్యాల, ఫిబ్రవరి 10,ప్రభాతవార్త :**
మున్సిపల్ ఎన్నికలు సజావుగా,ప్రశాంతమైన వాతవరణంలో జరిగేలా చూడాలని విధుల పట్ల నిర్లక్ష్యం వహించోద్దని సిద్దిపేట పోలీస్ కమీషనర్ రష్మీ పెరుమాళ్ తెలిపారు.మంగళవారం పట్టణంలోని గురుకుల పాఠశాలలో పోలింగ్ సామాగ్రి పంపిణి జరుగుతున్న తీరుపై పోలీస్, సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఎన్నిక లెక్కింపు కేంద్రంతో పాటు బ్యాలెట్ బాక్స్‌లను భద్రపరిచే స్ట్రాంగ్ రూంలను పరిశీ లించారు. అలాగే పోలింగ్ కేంద్రాలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు చేపట్టాలని ప్రజలపట్ల మర్యాదగా ప్రవర్తించాలని పోలీసు సిబ్బందికి సూచించారు.ప్రతి ఒక్కరూ ఎన్నికల నియమని బంధనలు పాటించాలన్నారు.

## పేదరోగులకు వరం సిఎం సహాయ నిధి : మహ్మద్‌రఫి



చింతల్ సర్కిల్ భగత్‌సింగ్‌నగర్‌కు చెందిన కిడ్నీ వ్యాధిబాధితులు రామలక్ష్మి, రామ శ్రీహరిలకు సిఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేస్తున్న బిఆర్‌ఎస్ అధ్యక్షులు మహ్మద్ రషీదా మహ్మద్‌రఫి తదితరులు

**కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త**

ప్రతిఒక్కరూ ఆరోగ్య పరిరక్షణకు తగుజాగ్రత్తలు తీసుకోవడం తప్పనిసరి అని చింతల్ బిఆర్‌ఎస్ అధ్యక్షులు, కార్పొరేటర్ రషీదా మహ్మద్‌రఫి సూచించారు. చింతల్ సర్కిల్ భగత్‌సింగ్‌నగర్‌కు చెందిన రామలక్ష్మి ఆమె కుమారుడు రామ శ్రీహరిలకు ఒక్కొక్కరికి రెండు లక్షల రూపాయల చొప్పున ముఖ్యమంత్రి సహాయనిధి క్రింద మంజూరీ అయిన సిఎంఆర్‌ఎఫ్ చెక్కులకు సంబందించిన ఎల్‌ఒసిలను చింతల్ ఎంఎల్‌ఎ క్యాంప్ కార్యాలయంలో అందజేశారు. ఈసందర్భంగా మహ్మద్ రషీదా మహ్మద్‌రఫి మాట్లాడుతూ కుత్బుల్లాపూర్ భగత్‌సింగ్‌నగర్‌కు చెందిన రామకలక్ష్మితోపాటు ఆమె కుమారుడు రామ శ్రీహరిలు కిడ్నీవ్యాధితో ఇబ్బంది పడుతున్న విషయం తెలుసుకున్న ఎల్‌ఎల్‌ఏ వివేకానంద్ ప్రత్యేకచొరవతో ఒక్కొక్కరికి రు. లు. రెండు లక్షల చొప్పున మంజూరీ చేయించడంపట్ల ఆయన డివిజన్ ప్రజలతరుపున వివేకానంద్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డివిజన్ నాయకులు బసవరాజ్, శేఖర్‌రావు, సాంభయ్య, స్వామాట్‌లు పాల్గొన్నారు.

## బాక్స్ డ్రైన్ నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే



అభివృద్ధి పనులకు శంఖుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

**అల్వాల్, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త:** ప్రజా సమస్యలను ప్రణాళికాబద్దంగా పరిష్కరిస్తున్నామని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం అల్వాల్, వెంకటాపురం డివిజన్లకు చెందిన కార్పొరేటర్లు శాంతి శ్రీనివాస్ రెడ్డి, సబిత అనీల్ కిషోర్‌లుతో కలిసి 2 కోట్లు వ్యయంతో చేపట్టనున్న బాక్స్ డ్రైన్ పనులను ఎమ్మెల్యే శంఖుస్థాపన చేశారు. సర్కిల్ సమగ్రాభివృద్ధిలో బాగంగా వరద నీటి కాలువలు, డ్రైనేజీ పనులకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అనీల్ కిషోర్, గిరి, విజయ శేఖర్, ప్రేమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## గుర్రపు డెక్క పనులను త్వరగా పూర్తి చేయండి : కార్పొరేటర్



మోత్తుల కుంట చెరువును పరిశీలిస్తున్న కార్పొరేటర్

**అల్వాల్, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త:** గుర్రపు డెక్క పనులను త్వరితగతిన పూర్తి చేయాలని మచ్చబొల్లారం కార్పొరేటర్ జితేందర్ నాథ్ అధికారులను కోరారు. మంగళవారం సర్కిల్ డిసి భోగేశ్వర్‌తో కలిసి మోత్కుల కుంట చెరువును కార్పొరేటర్ పరిశీలించారు. దోమలుతో ప్రజలు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో పనులు చేపట్టామని జితేందర్‌నాథ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో నేతలు బొబ్బిలి సురేందర్ రెడ్డి, దిడ్ల స్వామి, శ్రీశైలం యాదవ్, సహదేవ్, కొండల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్యామ్‌కు ఘన సన్మానం



ప్రధాన కార్యదర్శి శ్యామును సన్మానిస్తున్న పి.వి.రమణ తధితరులు

**తార్నాక, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా తొలిసారిగా ఒక దళిత అధికారి ఎన్నిక కావడం మంచి పరిణామం అని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఈ సందర్బంగా ఆఫీసర్స్ ఫోరం ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నికైన బి. శ్యాము కి సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చీఫ్ సెక్రటరీ (రిటైర్డ్) కాకి మాధవరావు అధ్యక్షత వహించారు. అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం జాతీయ అధ్యక్షులు పి. వి. రమణతో పాటు సంఘ నాయకులు పాల్గొని, అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం తరపున బి. శ్యాము ను ఘనంగా సన్మానించారు. ఈ సన్మాన కార్యక్రమంలో సెంటర్ ఫర్ దళిత్ స్టడీస్ అధ్యక్షులు మల్లేపల్లి లక్ష్మయ్య, ఐడిఏఎస్ (రిటైర్డ్) పి.ఎస్.ఎన్. మూర్తి, ఆఫీసర్స్ ఫోరం కన్వీనర్ శ్రీ సిద్ధోజి రావు, కేకే రాజా, పీపుల్స్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ సిహెచ్. బాలకృష్ణ, రాజేంద్రకుమార్, జగదీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. అలాగే అనేకమంది ఐఏఎస్, ఐపీఎస్, గ్రూప్-1 అధికారులు, వివిధ శాఖలకు చెందిన ఉన్నతాధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొని బి. శ్యాము కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్బంగా తెలంగాణ రాష్ట్ర గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఏలూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## ఆదర్శ డివిజన్‌గా రాజేంద్రనగర్

**-అభివృద్ధి పనులకు కార్పొరేటర్ శంకుస్థాపనలు**



**అత్తాపూర్ ఫిబ్రవరి10, ప్రభాతవార్త :** మౌలిక వసతుల కల్పనలో రాజేంద్రనగర్ డివిజన్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతున్నామని కార్పొరేటర్ అర్చన జయప్రకాష్ పేర్కొన్నారు. మంగళవారం రాజేంద్రనగర్ డివిజన్ బుద్వేల్ గ్రామం గ్రీన్‌సిటిలో రూ.75లక్షలతో చేపడుతున్న సిసి రోడ్డు పనులకు అదేవిధంగా శివరాంపల్లి శిశు మందిర్ దగ్గర రూ.49లక్షలతో చేపట్టి సిసి రోడ్డు పనులకు అర్చన జయప్రకాష్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్బంగా కార్పొరేటర్ అర్చన జయప్రకాష్ మాట్లాడుతూ....గత ఐదేళ్ల కాలంలో కోట్లాది రూపాయల నిధులతో రాజేంద్రనగర్ డివిజన్‌ను ఎంతో అభివృద్ధి చేశామని అన్నారు. మౌలిక వసతుల కల్పనకు అధిక నిధులు కేటాయించి డివిజన్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దడం జరిగిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రజనీకాంత్ గౌడ్, నరేందర్, శ్రీనివాస్ కాకా, ఆదిత్య, రాజు గౌడ్, సురేష్, సూర్యప్రకాష్ రెడ్డి, శివాజీ, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు ఏకాగ్రతతో చదివి మెరుగైన ఫలితాలు సాధించాలి : ఎమ్మెల్యే తలసాని

**బేగంపేట ఫిబ్రవరి 10, ప్రభాతవార్త**

విద్యార్థులు ఏకాగ్రతతో చదివి 10వ తరగతిలో మెరుగైన ఫలితాలు సాధించాలని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. మంగళవారం రాంగోపాల్‌పేట డివిజన్ ఓల్డ్‌గ్యాస్‌మండీ ఆదెయ్య మెమోరియల్ స్కూలు ను సందర్శించారు. ఈ సందర్బంగా 10వ తరగతి విద్యార్థులకు ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెల్సుకున్నారు. 10వ తరగతి పరిక్షల సందర్బంగా ప్రత్యేక తరగతులకు హాజరవుతున్న విద్యార్థులకు ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ స్నాక్స్ పంపిణీ చేసారు. అనంతరం స్కూలు లోని సమస్యల గురించి ప్రధానోపాధ్యాయుడు, ఇతర సిబ్బందిని అడిగి తెల్సుకున్నారు. స్కూలు ఆవరణలో బోర్ రిపేరు చేయించాలని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని వారు ఎమ్మెల్యేను కోరారు. స్పందించిన ఎమ్మెల్యే వెంటనే ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. స్కూలు అభివృద్ధి, విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. అదే విధంగా స్కూలు ఆవరణలో ఉన్న భవిత కేంద్రాన్ని సందర్శించి విద్యార్థుల యోగ క్షేమాలను అడిగి తెల్సుకున్నారు. ఈ కేంద్రంలో విద్యార్థుల సౌకర్యార్థం కా



విద్యార్థులకు స్నాక్స్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే తలసాని.

ర్పెట్ ఏర్పాటు చేయాలని కోరగా వెంటనే పంపిస్తానంటూ హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట మాజీ కార్పొరేటర్లు అత్తెల్లి మల్లిఖార్జున్ గౌడ్, అరుణాగౌడ్, స్కూలు ప్రధానోపాధ్యాయుడు బాలాజీ, సిబ్బంది భవానీ, కల్పన, పుష్పలత, ఏపీసీ ఛైర్మన్ లావణ్య, బీఆర్‌ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు అత్తెల్లి శ్రీనివాస్‌గౌడ్, ఆకుల హరికృష్ణ, నాయకులు టి.శ్రీహరి, కిషోర్, కొండాపురం మహేష్ యాదవ్, సతీష్, గణేష్, జనార్దన్‌రాజు తదితరులు ఉన్నారు. స్థానిక బస్తీ వాసులు లడ్డు, వినోద్, వినయ్, జగన్, శీను, అప్పి, సురేష్ తదితరులు ఉన్నారు.

## అన్ని వర్గాల విముక్తికి బిసిలు రాజ్యాధికారమే ఏకైక మార్గం : సత్యనారాయణ

**సైఫాబాద్, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త:** గత ఏడున్నర దశాబ్దాలుగా రెడ్డి, రావుల పాలనలో బానిసలుగా, బిచ్చగాళ్ళగా మారిన బిసిలను, ఇతర వంచిత వర్గాల విముక్తికి రాజ్యాధికారం ఒక్కటే మార్గమని తెలంగాణ బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ స్పష్టం చేశారు. మంగళవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ 75 సంవత్సరాలకు పైగా రాష్ట్రాన్ని పాలించిన అ గ్రవర్ణాలు బిసిలను, ఇతర వర్గాలను దారుణంగా మోసం చేశారని, 6 శాతం ఉన్న ఈ అగ్రవర్ణాలు సంపద, రాజకీయ, ఆర్థిక, పారిశ్రామిక తదితర రంగాలలో 90 శాతానికిపైగా గుత్తాధిపత్యం వహిస్తూ బిసిలను, ఇతరులను నిత్యం బతుకుదెరువు పోరాటాలలో ఆత్మహత్యలతో మగ్గిపోయేలా చేశారని ఆందోళన వ్యక్తం చేశారు. అధికారమనే మాస్టర్‌కీ ద్వారా తమ వర్గాలను అందనంత అభివృద్ధిలో ముందుంచి ఇతరులు ఎప్పటికి తమకు పోటీ కాలేరనే స్థితికి తెస్తున్నారని ఆరోపించారు. ప్రతి ఎన్నికల ముందు



అభివాదం చేస్తున్న బిసి నేతలు ఎర్ర సత్యనారాయణ, గుజ్జ కృష్ణ, జనార్ధన్ తదితరులు

పార్టీలు బిసిలకు రిజర్వేషన్‌లు, బడ్జెట్‌లో వాటాలు అదుకృతినే పథకాలను ముందుపెట్టి ఓటుకింత అని ముట్టచెప్పి డబ్బులు ఇవ్వనిదే ఓట్లు వేయరనే అపవాదులు వారిపైన వేసి పబ్బం గడుపుకుంటున్నాయని విమర్శించారు. అన్ని సమస్యలు పరిష్కారానికి ఏకైక మార్గం రాజ్యాధికార ఉద్యమమేనని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో బిసి నాయకులు కోలా జనార్ధన్, పి.సుధాకర్ ముదిరాజ్, మీనగా గోపి తదితరులు పాల్గొన్నారు.

## చదువులతో సమానంగా ఆటలకు సమయం ఇవ్వాలి

**డబ్ల్యుఆర్‌పిఎఫ్ రాష్ట్ర చైర్మన్ పొన్న రమేష్**

**నార్సింగి, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త :** విద్యార్థులు చదువులతో సమానంగా ఆటలకు సమయం ఇవ్వాలని డబ్ల్యుఆర్‌పిఎఫ్ రాష్ట్ర చైర్మన్ పొన్న రమేష్ పేర్కొన్నారు. నార్సింగిలో రాష్ట్రస్థాయి డబ్ల్యుఆర్‌పిఎఫ్ పోటీలను నిర్వహించారు. గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ తలారి మల్లేష్ ముదిరాజ్, కాంగ్రెస్ అధ్యక్షులు క్యాతం అశోక్ యాదవ్, నార్సింగి మార్కెట్ కమిటీ చైర్మన్ వేణు గౌడ్‌లతో కలిసి పొన్న రమేష్ ఈ పోటీలలో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేసి అభినందించారు. అనంతరం వారు మాట్లాడుతూ, ఈ పోటీల్లో వివిధ స్థాయిల్లో విజేతలుగా నిలిచిన 19.మంది క్రీడాకారులు ఈ నెల 22.వ, తేదీన దేశ రాజధాని ఢిల్లీలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారని వివరించారు. ఆటలు నిత్యం సాధన చేయడం వలన సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటామని తెలిపారు. ఆటల పోటీల వలన మనలో గెలుపు-ఓటములను సమానంగా స్వీకరించే గుణం పెరుగుతుందన్నారు. తమ జట్టు గెలుపు కోసం సర్వశక్తులు ఒడ్డి గెలిపించాలన్న కసి పెరుగుతుందన్నారు. నిష్ణాతులైన గురువుల వద్ద శిక్షణ



రాష్ట్రస్థాయి డబ్ల్యుఆర్‌పిఎఫ్ పోటీల విజేతలకు బహుమతులు అందజేస్తున్న ముఖ్య అతిథులు.

తీసుకోవడం వలన రంగారెడ్డి, హైదరాబాద్ ప్రాంతాలకు చెందిన 19.మంది క్రీడాకారులు విజేతలుగా నిలిచారని తెలిపారు. ఈ 19.మంది జాతీయ స్థాయి పోటీలకు ఎంపికవ్వడం గర్వంగా ఉందన్నారు. తల్లిదండ్రులు తమ బిడ్డలను చదువు, చదువు అంటూ ఒత్తిడి చేయడం సరికాదని, వారిలోని ప్రతిభను గుర్తించి ఆటల్లో కూడా అవకాశం కల్పించి, శిక్షణ ఇస్తే అద్భుతాలు సృష్టిస్తారన్నారు. ఇప్పుడు ఆటలకు కూడా దేశ వ్యాప్తంగా మంచి క్రేజీ ఉందన్నారు. క్రికెట్, కబడ్డీ, రెజ్లింగ్, హాకీ, ఫుట్‌బాల్, వాలీబాల్, టెన్నీస్, బ్యాట్మింటెన్ వంటి ఆటలకు మంచి పేరుందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు కోచ్‌లు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## కళలు, ఆధ్యాత్మికతకు నిలువెత్తు రూపం కె.వి. రమణాచారి : బండారు దత్తాత్రేయ

**చిక్కడపల్లి ఫిబ్రవరి 10 ( ప్రభాతవార్త ) :** ఐఏఎస్ అధికారిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుండి పదవీ విరమణ తర్వాత ప్రభుత్వ సలహాదారుగా పనిచేసే వరకు కె.వి. రమణాచారి తన విధులను ఎంతో నిబద్ధతతో నిర్వహించారని హర్యాన పూర్వ గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. మంగళవారం నల్ల కుంట లోని శంకర మఠం లో కిన్నెర ఆర్ట్స్ థియేటర్స్ నిర్వహణలో డాక్టర్ కె వి రమణ జన్మ దినోత్సవం సందర్భం గా జరుగుతున్న హరికథా సప్తహం లో భాగంగా జయంతి సావిత్రి చే శ్రీనివాస కళ్యాణం హరి కథా గానం ఆసక్తికరం జరిగింది. బండారు దత్తాత్రేయ రమణాచారి దంపతులు ను సత్కరించి మాట్లాడారు. రమణాచారి ఏడుగురు ముఖ్య మంత్రుల వద్ద ఐ ఎ ఎస్ అధికారిగా పని చేసినా కళాకారుల సంక్షేమం గురించి ఆలోచన చేసి వారికి సలహాలు ఇచ్చే వారు అని గుర్తుచేశారు రమణ వంటి అధికారులు అరుదుగా ఉంటారు అని చెప్పారు. ముఖ్యంగా తెలుగు భాష, సాహిత్యం, తెలంగాణ సంస్కృతిని కాపాడటంలో ఆయన పోషించిన పాత్ర అద్వితీయమని పేర్కొన్నారు. ముఖ్యంగా కళలు, సంస్కృతి , ఆధ్యాత్మిక రంగాల్లో ఆయన చేసిన కృషి అనన్యసామాన్య



కెవి.రమణాచారి దంపతులను సత్కరిస్తున్న హర్యాన రాష్ట్ర పూర్వ గవర్నర్ బండారు దత్తాత్రేయ

మని, తెలంగాణ సంస్కృతిని ప్రపంచవ్యాప్తం చేయడంలో ఆయన పాత్ర కీలకమని ప్రశంసించారు. వారు మరిన్ని సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని బండారు దత్తాత్రేయ ఆకాంక్షించారు. మనిషి జీవితం శాశ్వతం కాదనీ ఎంత కాలం బ్రతికింది కాక ఎలా జీవించింది ముఖ్యం అని ప్రభుత్వ పూర్వ సలహాదారు డాక్టర్ కె వి రమణ అన్నారు. వేదిక పై కళా పోషకులు భోగరాజు మూర్తి రవి శంకర్, వెంకట్ రావు, రాధాకృష్ణ, సతీష్ చౌదరి తదితరులు పాల్గొనగా కిన్నెర రఘురాం స్వాగతం పలికారు.

## జలమండలి ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

**- సంస్థ ఎండి అశోక్‌రెడ్డికి మొగుళ్ళ రాజిరెడ్డి విజ్ఞప్తి**

**హైదరాబాద్, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త**

జలమండలిలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని తెలంగాణ జలమండలి ఉద్యోగుల యూనియన్ (ఐఎన్‌టియుసి) డిమాండ్ చేసింది. మంగళవారం జలమండలి ఎండి కె.అశోక్‌రెడ్డికి యూనియన్ ప్రతినిధి బృందం వినతిపత్రం అందజేసింది. ఉద్యోగుల సంక్షేమం, బోర్డు పనితీరు మెరుగుదల కోసం యాజమాన్యం ఇటీవల చేపట్టిన చర్యలకు కృతజ్ఞతలు తెలుపుతూ, ఉద్యోగులపై పెరుగుతున్న పనిభారం దృష్ట్యా తక్షణ చర్యలు అవసరమని యూనియన్ స్పష్టం చేసింది. బోర్డును పరిపాలనా సౌలభ్యం కోసం మూడు జోన్లుగా విభజించనున్న నేపథ్యంలో, స్థాపన, ఖాతాలు, సాంకేతిక విభాగాలు, ఫీల్డ్ సిబ్బందిపై పనిభారం మరింత పెరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేసింది. ఈ సందర్బంగా తెలంగాణ జలమండలి ఉద్యోగుల యూనియన్ అధ్యక్షుడు మొగుళ్ళ రాజిరెడ్డి మాట్లాడుతూ జలమండలి ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను యాజమాన్యానికి తెలియజేశామని, పెండింగ్ సమస్యలన్నింటిపై త్వరితగతిన అనుకూల నిర్ణయాలు తీసుకోవాలని కోరినట్లు ఆయన తెలిపారు. ఈ సమస్యలను ప్రభుత్వం దృష్టికి కూడా తీసుకెళ్ళి వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. విధి నిర్వహణలో మరణించిన ఉద్యోగుల కుటుంబాలకు కారుణ్య నియామ కాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. జూనియర్ అసిస్టెంట్ పోస్టుల్లో ఉన్న



ఉద్యోగుల సమస్యను పరిష్కరించాలని జలమండలి ఎండి అశోక్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న జలమండలి ఉద్యోగుల యూనియన్ అధ్యక్షుడు మొగుళ్ళ రాజిరెడ్డి

ఖాళీలకు కేటాయించాల్సిన 5 శాతం కారుణ్య కోటాను పాటించకుండా, నేరుగా ప్రభుత్వానికి నియామకాల కోసం తెలియజేయడాన్ని తీవ్రంగా తప్పుబ ట్టారు. ప్రస్తుతం ఖాళీగా ఉన్న సుమారు 56 జూనియర్ అసిస్టెంట్ పోస్టులను అర్హత కలిగిన జిపిఈ (పిఅండ్ఏ) ఉద్యోగులతో భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఇతర పెన్షనర్ల మాదిరిగానే ఎన్ పెన్షనర్లకు కూడా మెడిక్లెయిమ్ పాలసీ, హెల్త్ కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి రాఘవేంద్రరాజ్, అసోసియేట్ అధ్యక్షుడు అల్లి శ్రావణ్ కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్‌లు ఏం.రాజా, కె.ఆనంద్‌రెడ్డి, వాటర్ వర్క్స్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు కె.రాజిరెడ్డి, అసోసియేట్ అధ్యక్షుడు ఎండి. జహంగీర్, ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ వైస్ చైర్మన్ శంకర్ ప్రకాష్, మేవ నేత అక్తర్ అలీ, యూనియన్ నేతలు సి.రాజు, జి. కృష్ణ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## బైక్ ఢీకొని వ్యక్తి మృతి

**అత్తాపూర్ ఫిబ్రవరి10, ప్రభాతవార్త :**

రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన రాజేంద్రనగర్ పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ సుమన్ తెలిపిన వివరాల ప్రకారం.. హైదర్‌గూడలో నివాసం ఉండే సురేందర్(46) హైదర్‌గూడ పిల్లర్ నంబర్ 153 వద్ద రోడ్డు దాటుతున్నాడు. ఈ క్రమంలో అతివేగంగా వచ్చిన బైక్ అతడిని బలంగా ఢీ కొట్టింది. దీంతో సురేందర్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఉస్మానియాకు తరలించారు. చికిత్స పొందుతూ చనిపోయాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## జనరల్ స్థానాల్లో బిసి అభ్యర్థులను గెలిపించండి : బిసి పొలిటికల్ ఫ్రంట్ పిలుపు

**హైదరాబాద్, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త**

జర్నల్ స్థానాలలో బీసీ అభ్యర్థులను గెలిపించాలని బీసీ పొలిటికల్ ఫ్రంట్ పిలుపునిచ్చింది. చిక్కడపల్లిలోని బీసీ పొలిటికల్ ఫ్రంట్ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో అతిథి విచ్చేసిన బీసీ పొలిటికల్ ఫ్రంట్ ఛైర్మన్ బాలగోని బాల్‌రాజ్‌గౌడ్ మాట్లాడుతూ.. బీసీ రిజర్వేషన్ల అభ్యర్థులతో పాటు జర్నల్ స్థానాలలో బీసీలను అత్యధికంగా గెలిపించాలని రాష్ట్రంలో ఉన్న బిసిలకు పిలుపునిచ్చారు. 42 శాతం బీసీ రిజర్వేషన్లను విస్మరించిన కాంగ్రెస్ పార్టీకి బీసీ రిజర్వేషన్ల పైన కోర్టు కెళ్ళిన వారికి బి ఫారంతో పాటు, అతని గెలుపుకు అన్ని తానై చూస్తున్న మాజీ మంత్రి మల్లారెడ్డి పైన చర్యలు తీసుకోవాలని చెప్పిన ఇప్పటికీ స్పందించని పార్టీ అధినేత కేసీఆర్‌కు తగిన బుద్ధి చెప్పాలన్నారు. జనరల్ స్థానాలలో పోటీ చేస్తున్న బీసీ అభ్యర్థులకు వెన్నుదన్నుగా ఉండి అత్యధికంగా గెలిపించి అన్ని రాజకీయ పార్టీలకు చెంప చెల్లుమనే లాగ బుద్ధి చెప్పాలని బాలరాజ్ గౌడ్ పిలుపునిచ్చారు. హక్కులు అడుక్కుంటే రావని పోరాడితే వస్తాయని ఓటు ద్వారానే రాజ్యాధికారం సాధిస్తామని ఇది బీసీలు గమనించి ఓటు వేయాలని కోరడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ పొలిటికల్ ఫ్రంట్ వైస్ చైర్మన్ ఎస్.దుర్గయ్య గౌడ్, బీసీ పొలిటికల్ ఫ్రంట్ రాష్ట్ర కన్వీనర్స్ బైరు శేఖర్, ఎల్లికట్టే విజయ్‌కుమార్‌గౌడ్, అంబాల నారాయణగౌడ్, అయిలి వెంకన్నగౌడ్, నాగభూషణం, సింగం నాగేష్‌గౌడ్ పాల్గొన్నారు.



బీసీ పొలిటికల్ ఫ్రంట్ రాష్ట్ర కార్యాలయంలో మాట్లాడుతున్న ఫ్రంట్ ఛైర్మన్ బాలగోని బాల్‌రాజ్‌గౌడ్

## అంబర్‌పేటలో రాజకీయాలకతీతంగా అభివృద్ధి : ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

**హైదరాబాద్, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త**

అంబర్‌పేట నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. మంగళవారం కాచిగూడ డివిజన్ వీరన్నగుట్టలో రూ.34 లక్షలు, బండలబస్తిలో రూ.18 లక్షల వ్యయంతో కమ్యూనిటీ హాల్స్ నిర్మాణ పనులను కాచిగూడ కార్పొరేటర్ కన్నె రమేష్‌యాదవ్‌తో కలిసి ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ ప్రారంభించారు. గోల్నాక డివిజన్ కమలానగర్‌లో రూ.20 లక్షలతో సిసి రోడ్డు నిర్మాణ పనులకు స్థానిక కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్‌గౌడ్‌తో కలిసి ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ ప్రారంభించారు. అనంతరం నల్ల కుంట డివిజన్, తిలక్‌నగర్ శివాలయం వద్ద రూ.25 లక్షలతో సీసీ రోడ్డు, తిలక్‌నగర్‌బస్తి గాంధీ బొమ్మ వద్ద రూ.9 లక్షలతో డ్రైనేజ్ పైప్ లైన్ నిర్మాణ పనులకు స్థానిక కార్పొరేటర్ వై.అమృత తో కలిసి ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవాల సందర్బంగా అభివృద్ధి పనులు చేపట్టిన బస్తీల్లో ఎమ్మెల్యే కాలేరు పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గడిచిన వారం రోజులుగా రూ.15 కోట్లతో అభివృద్ధి పనులకు భూమి పూజ చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. అభివృద్ధిని పనుల పట్ల సంబంధిత అధికారులు పర్యవేక్షణ తప్పనిసరిగా ఉండాలని, సదరు కాంట్రాక్టర్లు నాణ్యత ప్రమాణాలను పాటించాలని ఆదేశించారు. అభివృద్ధి పనుల పట్ల అధికారులు పర్యవేక్షణ అవసరమని, అధికారుల నిర్లక్ష్యం తగదన్నారు. స్థానిక ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సకాలంలో నిర్మాణ పనులను పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. రోడ్డు తవ్వి వదిలేయకుండా సకాలంలో సిసి రోడ్డు పనులు చేపట్టి స్థానికులకు ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. స్థానికంగా వీధిదీపాల సమస్య, పాడైపోయిన విద్యుత్ స్తంభాలను, డ్రైనేజీ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని, స్థానిక ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా సమస్యలను సత్వరం పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బిఆర్‌ఎస్ పార్టీ నాయకులు బిజెపి నాయకులు, స్థానిక బస్తీ వాసులు, జలమడలి అధికారులు జిహెచ్‌ఎంసి అధికారులు తదితరులు పాల్గొన్నారు



కాచిగూడలో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్‌యాదవ్

## ఐదేళ్లలో గచ్చిబౌలిలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు : కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి



సమావేశంలో ప్రసంగిస్తున్న కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి

**గచ్చిబౌలి, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త**

గత ఐదేళ్ల పదవీకాలంలో గచ్చిబౌలి డివిజన్ పరిధిలో కోట్లాది రూపాయల నిధులతో అభివృద్ధి పనులు చేపట్టామని గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ వి.గంగాధర్‌రెడ్డి తెలిపారు. కార్పొరేటర్‌గా ఐదేళ్ల పదవీకాలం ముగిసిన సందర్భంగా మంగళవారం గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని గౌలిదొడ్డి వార్డు కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గంగాధర్‌రెడ్డి మాట్లాడుతూ గత ఐదేళ్ల కాలంలో గచ్చిబౌలి డివిజన్ పరిధిలో 920కోట్ల రూపాయల నిధులతో ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగాయని అన్నారు. ముఖ్యంగా కార్పొరేటర్‌గా పార్టీలకు అతీతంగా పనిచేస్తూ డివిజన్ అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగానని తెలిపారు. డివిజన్ పరిధిలోని శ్మశానవాటికలు, పార్కుల అభివృద్ధి, డ్రైనేజీ కాలువల నిర్మాణం, రహదారుల కోసం దాదాపు 328కోట్ల రూపాయల నిధులతో పనులు చేపట్టామన్నారు. కొత్తగా ఏర్పడిన కాలనీలతో పాటు ఇప్పటి వరకు మంచినీటి వసతి లేని కాలనీలకు 45కోట్ల రూపాయల నిధులతో పైప్‌లైన్ నిర్మాణం చేపట్టి త్రాగునీటిని అందించామని తెలిపారు. విద్యుత్ సరఫరా సక్రమంగా కొనసాగేందుకు 5కోట్ల రూపాయల నిధులతో పనులు చేపట్టామన్నారు. దీంతో పాటు గచ్చిబౌలి డివిజన్ పరిధిలో కోట్లాది రూపాయల నిధులతో ప్రభుత్వం ఫ్లైఓవర్ల నిర్మాణం చేపట్టిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగామన్నారు. ఈ సమావేశంలో కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డితో పాటు డివిజన్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రేణుక ఎల్లమ్మ దేవాలయ క్యాలెండర్ ఆవిష్కరణ



మంగళవారం రేణుక ఎల్లమ్మ దేవాలయ క్యాలెండర్ ఆవిష్కరించిన దృశ్యం

**చిక్కడపల్లి ఫిబ్రవరి 10 ( ప్రభాతవార్త ) :** అశోక్ నగర్ నగర గ్రంథాలయ సంస్థలో ఆవరణలో రేణుక ఎల్లమ్మ దేవాలయ కమిటీ రూపొందించిన 2026 నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం మంగళవారం ఘనంగా జరిగింది. నగర గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేసిరెడ్డి ఉపేందర్ రెడ్డి , సంస్థ కార్యదర్శి పొట్లూరి పద్మజ ఆవిషరించి ప్రసంగించారు. అధ్యాత్మికతతో పాటు సేవా దృక్పథం చాల అవసరమన్నారు. దేవాలయ కమిటీలు భక్తి కార్యక్రమాలతో పాటు సామాజిక చైతన్యానికి తోడ్పడాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రభుత్వ పెన్షనర్ల జేఏసీ అధ్యక్షులు కె. లక్ష్మయ్య, దేవాలయ కమిటీ అధ్యక్షులు శ్రీ వెంకటేష్ యాదవ్, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్ రెడ్డి, ఉపాధ్యక్షులు దాచేప ల్లి బుచ్చయ్య, ప్రధాన కార్యదర్శి బొల్లం మహేందర్, కోశాధి కారి రామ్మోహన్ పాల్గొన్నారు. అలాగే లైబ్రరీ పెన్షనర్ల రాష్ట్ర అధ్యక్షులు కొక్కుల దేవేందర్, దేవాలయ కమిటీ సభ్యులు, గ్రంథాలయ కార్యాలయ సిబ్బంది మరియు గ్రంథాలయ సంస్థ పెన్షనర్లు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## అపార్ట్‌మెంట్‌లో వ్యక్తి ఆత్మహత్య

**ముషీరాబాద్, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త:** ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడి మృతి చెందిన ఘటన దోమలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. దోమల గూడ సీఐ అహ్మద్ అలీ తెలిపిన వివరాల ప్రకారం దోమలగూ డలోని బండమైసమ్మ కమ్యూనిటీ హాల్ వెనక ఒక అపార్ట్‌మెం ట్‌లో నేపాల్‌కు చెందిన రమేష్ ధోలి (25) అనే వ్యక్తి భార్య కవిత, ఒక కుమార్తె (2) కలసి వాచ్‌మెన్‌గా పనిచేస్తూ నివసిస్తున్నాడు. ఇటీవల మద్యానికి బానిసైన రమేష్ సోమవారం రాత్రి 11 గంటల సమయంలో తాగి, ఇంటికి వచ్చాడు. పాప ఏడుస్తూ ఉండటంతో పాపను తీసుకుని భార్య కవిత బయటకు రావటంతో ఫ్యాన్‌కు రమేష్ ఉరివేసుకున్నాడు. అప్పుడే ఇంట్లోకి వచ్చిన కవిత స్థానికుల సాయంతో రమేష్‌ను కిందకు దింపగా, అప్పటికే అతను మృతి చెందాడు. రమేష్ సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించినట్లు సీఐ తెలిపారు.

## రంగస్థల విజ్ఞాన సర్వస్వం బుర్రా సుబ్రహ్మణ్యశాస్త్రి



కె.ఇందిరను రంగస్థల పురస్కారంతో సత్కరిస్తున్న వంశీరామరాజు, లక్ష్మీనారాయణ, శివప్రసాద్, భాగిశాస్త్రి తదితర అతిథులు

**రవీంద్రభారతి, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త :** తెలుగు నాటక రంగ సర్వస్వం, రంగస్థల విజ్ఞానం బుర్రా సుబ్రహ్మణ్యశాస్త్రి అని, ఆయన తెలుగునాటకరంగం గర్వించదగ్గ మహానటుడని వంశీ సంస్థల అధినేత కళాబ్రహ్మ శిరోమణి డా. వంశీరామ రాజు అన్నారు. అద్భుత రంగస్థల నటుడుగా ముఖ్యంగా స్త్రీ పాత్రలో మెప్పించి గొప్పగా రాణించి పేరుప్రఖ్యాతులు పొందారని, పోషించిన సక్కుబాయి, చింతామణి, చంద్రమతి మరే పాత్రలైనా ప్రజలు బ్రహ్మరథం పట్టారని చెప్పారు. తన ఆహార్యం, ఆంగికంతో ఏపాత్రనైనా అవలీలగా పోషించే సుబ్రహ్మణ్యశాస్త్రి భారత ప్రభుత్వం తప్పకుండా పద్మశ్రీ అవార్డుతో గౌరవించాలని అధ్యక్షోపన్యాసంలో లంక లక్ష్మీనారాయణ విజ్ఞప్తి చేశారు. బుర్రా గొప్పనటుడేకాదు పండితుడని, సంప్రదాయ కళాకారుడైనా ఆధునిక నాటక విద్యార్థులకు పాఠాలు బోధించే వారని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతికశాఖ సౌజన్యంతో బుర్రా సుబ్రహ్మణ్యశాస్త్రి కళాపీఠం ఆధ్వర్యంలో రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో జరిగిన బుర్రా సుబ్రహ్మణ్యశాస్త్రి 89వ జయంతి వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన డా. వంశీరామరాజు సభాధ్యక్షుడు లంక లక్ష్మీనారాయణ, విశిష్ట అతిథులు చిట్టా వెంకట శివప్రసాద్, సంస్థ అధ్యక్ష కార్యదర్శులు రామకృష్ణ, భాగి శివశంకరశాస్త్రి తదితరులతో కలిసి ప్రఖ్యాత రంగస్థల, ఆకాశవాణి, దూరదర్శన్ కళాకారిణి కె.ఇందిరను ఘనంగా సత్కరించి బుర్రా సుబ్రహ్మణ్యశాస్త్రి రంగస్థల పురస్కారం ప్రదానంచేసి అభినందించారు. సభకుముందు భాగి శివశంకరశాస్త్రిచే భక్తరామదాసు ఏకపాత్రాభినయం; ప్రఫుల్లసుందర్‌చే సుబ్రహ్మణ్యశాస్త్రి పద్యాలు, పాటల ఆలాపన సభికులను ఆకట్టుకున్నాయి.

## రౌడీషీటర్లకు జగద్గిరిగుట్ట పోలీసుల హెచ్చరిక..



రౌడీషీటర్లతో మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ వెంకటేశం

**జగద్గిరిగుట్ట, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త**

జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో రౌడీషీటర్ల కదలికలపై పోలీసులు ప్రత్యేక నిఘా ఉంచారు. ఈ నేపథ్యంలో మంగళవారం జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లను పోలీస్ స్టేషన్‌కు పిలిపించి వారి ప్రస్తుత కార్యకలాపాలను ఆరా తీశారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలిగించినా, శాంతి భద్రతలకు విఘాతం కలిగించినా, నేరాలకు పాల్పడినా చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని జగద్గిరిగుట్ట ఇన్‌స్పెక్టర్ వెంకటేశం హెచ్చరించారు. సత్ప్రవర్తనతో సమాజంలో మెలగాలన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా రౌడీషీటర్లపై నిరంతర నిఘా కొనసాగుతుందన్నారు.

## డిజిపి కార్యాలయాన్ని ముట్టడించిన బిజెపి నేతలు



**అత్తాపూర్ ఫిబ్రవరి10, ప్రభాతవార్త :**

బిజెపి నేత మృతికి కారణమైన వారిని వెంటనే అరెస్టు చేయాలని బిజెపి నేతలు డిమాండ్ చేశారు. నారాయణపేట జిల్లా మక్తల్ మున్సిపాలిటీ పరిధిలోని 6 వార్డు బిజెపి అభ్యర్థి ఎరుకలి మహదేవ్ అధికార పార్టీ బెదిరింపులు తట్టుకోలేక మృతి చెందారని ఆరోపిస్తూ బిజెపి రాజేంద్రనగర్ డివిజన్ అధ్యక్షులు సందీప్ ముదిరాజ్ ఆధ్వర్యంలో డిజిపి ఆఫీస్ కార్యాలయం ముట్టడి చేశారు. రాజేంద్రనగర్ డివిజన్ నాయకులను అరెస్టు చేసి సైబరాబాద్ పోలీస్ స్టేషన్ కి తరలించారు. ఈ కార్యక్రమంలో హరికిషన్ జి, సోల్కర్ రెడ్డి, బండారు బాలకృష్ణ, జనరల్ సెక్రటరీ రాజశేఖర్ రెడ్డి, విజయ్ యాదవ్ అల్లి శివ నాయకులు పాల్గొన్నారు.



పోలింగ్ సామాగ్రిని తీసుకెళ్తున్న పోలింగ్ సిబ్బంది

## నేడే మున్సిపల్ ఎన్నికల పోలింగ్

**-ఏర్పాట్లు పూర్తిచేసిన అధికారులు..గజ్వేల్‌లో వారాంతపు సంత రద్దు**

**గజ్వేల్, ఫిబ్రవరి 10 (ప్రభాతవార్త):** గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ నేడు ఎన్నికలు జరుగనున్నాయి. ఎన్నికలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు సంబంధిత ఎన్నికల అధికారులు పేర్కొన్నారు. ఎన్నికల నేపథ్యంలో గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలో 67 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటుచేశారు. ప్రతి పోలింగ్‌కేంద్రం వద్ద ఎలాంటి అసౌకర్యం కలుగకుండా సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు. ఇందులో భాగంగా మంగళ వారం గజ్వేల్‌లోని బాలికల ఎడ్యుకేషన్ హబ్ వద్ద పోలింగ్ సిబ్బందికి పోలింగ్ మెటీరియల్‌ను జిల్లా ఎన్నికల పరిశీలకులు ఐషా మస్రత్ ఖానం అందజేశారు. ఎన్నికల నిర్వహణ కోసం నియమించిన 364 మంది పోలింగ్ సిబ్బందిని 5 మంది జోనల్ ఆఫీసర్స్ 5 రూట్ల ద్వారా పోలింగ్ కేంద్రాల వద్దకు చేర్చడం జరిగిందని తెలిపారు. మైక్రో అబ్జర్వర్లు 71 పోలింగ్ కేంద్రాలను వెబ్ క్యాస్టింగ్ ద్వారా నిఘాలో గమనించడం జరుగుతుందన్నారు. ఇదిలా వుండగా 11వ తేదీ బుధవారం గజ్వేల్ పట్టణంలో ఎన్నికలు ఉన్నందున ప్రతి బుధవారం నిర్వహించే వారాంతపు సంతను రద్దు చేస్తున్నట్లు తెలిపారు. బుధవారం ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ నిర్వహించడం జరుగుతుందని, పోలింగ్ ప్రశాంత వాతావరణంలో జరిగేలా ప్రజలు సహకరించాలన్నారు.

## పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సామాగ్రి తరలింపు

**హుస్నాబాద్ రూరల్, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త :** హుస్నాబాద్ మున్సిపాలిటీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి అధికారులు అన్ని ఏర్పాట్లను పూర్తిగా పూర్తిచేశారు. ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలను ముందుగానే చేపట్టారు. ఈ సందర్భంగా పట్టణంలోని మోడల్ స్కూల్‌లో ఎన్నికల సామాగ్రి పంపిణీ (డిస్ట్రిబ్యూషన్) కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. మంగళవారం ఉదయం నుంచే ఎన్నికల సిబ్బంది డిస్ట్రిబ్యూషన్ కేంద్రానికి చేరుకొని తమకు కేటాయించిన పోలింగ్ స్టేషన్లకు సంబంధించిన బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, సీల్స్, రిజిస్టర్లు తదితర ఎన్నికల సామాగ్రిని సరిచూసుకున్నారు. అధికారులు ఎన్నికల విధులు, భద్రతా ఏర్పాట్లపై సిబ్బందికి అవసరమైన సూచనలు ఇచ్చారు. అనంతరం ఎన్నికల సిబ్బందిని వారి వారి పోలింగ్ కేంద్రాలకు తరలించేందుకు ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన బస్సుల్లో పంపించారు. ఎన్నికల రోజు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీస్ శాఖతో సమన్వయం చేస్తూ భద్రతా ఏర్పాట్లు కూడా పటిష్టంగా చేపట్టినట్లు అధికారులు తెలిపారు.

## ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి



సమ్మె నోటీసు అందిస్తున్న సిఐటియు నాయకులు, ఆశావర్కర్లు

**బెజ్జంకి, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త :** ఆశావర్కర్ల సమస్యలు వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా నాయకులు తిప్పారపు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మండల పరిధిలోని తోటపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో డాక్టరన కృష్ణతేజకు మంగళవారం సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 29 కార్మిక చట్టాల స్థానంలో నాలుగు లేబర్ కోడ్లను అమలులోకి తెస్తూ ఇచ్చిన నోటిఫికేషన్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 12న దేశ వ్యాప్త సమ్మెకు కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తీసుకవచ్చిన 4 లేబర్ కోడ్లను రద్దు చేయాలన్నారు. ఆశా వర్కర్లకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలన్నార. సీనియారిటీ ప్రాతిపదికన ఆశా వర్కర్లను ఎఎన్ఎం పోస్టుల్లో పదోన్నతి కల్పించాలన్నారు. పనిభారాన్ని తగ్గించాలన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ పెన్షన్ ప్రకటించే వరకు పదవీ విరమణ ఉండరాదన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎల్లయ్య, ఆశా వర్కర్లు కుంట రమ, లక్ష్మి, శంకరమ్మ,హారిక, శంకరమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఆదర్శ గ్రామమే లక్ష్యంగా పనిచేస్తా : సర్పంచ్



గ్రామసభలో మాట్లాడుతున్న సర్పంచ్ ర్యాకం యాదగిరి

**మర్కుక్, ఫిబ్రవరి 10 (ప్రభాతవార్త):** గ్రామాన్ని అభివృద్ధి చేసి ఆదర్శ గ్రామమే లక్ష్యంగా పనిచేస్తామని సర్పంచ్ ర్యాకం యాదగిరి తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని చేబర్తి గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని పలు సమస్యలను ప్రజలు తమ దృష్టికి తీసుకురాగా, విడతల వారీగా పరిష్కరిస్తామని తెలిపారు. గ్రామాన్ని అందరి సహకారంతో అభివృద్ధి చేసుకుందామని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ శ్రీకాంత్, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి, అంగన్వాడీ టీచర్లు, గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

## సామాన్యునికి సమాచార హక్కు చట్టం వజ్రాయుధం

**సిద్దిపేట అర్బన్, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త :** సామాన్యునికి సమాచార హక్కు చట్టం వజ్రాయుధంలాంటిదని ప్రతి సామాన్యుడు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జాతీయ ఉపాధ్యక్షులు ఏటి అంజనేయులు, జిల్లా ఇన్‌చార్జి దేవరాయి ఎల్లం అన్నారు. మంగళవారం మెదక్ జిల్లా అధ్యక్షులు ఏటి అంజనేయులు సిద్దిపేట జిల్లా ఇన్‌చార్జిగా దేవరాయ ఎల్లంను నియమించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వ నిధుల దుర్వినియోగం జరగకుండా ప్రతి పౌరుడు తన హక్కులతో పాటు సామాజిక బాధ్యత కలిగేలా చేస్తూ వ్యవస్థలోని లోప భూయిష్టమైన ప్రతి సమస్యను పరిష్కార దిశగా నడిపించేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. సమాచార హక్కు చట్టం ప్రతి పౌరునికి ఒకేలా ఉంటుందని దేశంలో ఎక్కడైనా అవినీతి జరిగినా ప్రశ్నించే మనస్తత్వం ఉన్న ఏ వ్యక్తి అయినా సమాచార హక్కు చట్టం ద్వారా తమ సమస్యలను పరిష్కరించుకోవచ్చని తెలిపారు. తనపై నమ్మకం ఉంచి జిల్లా ఇన్‌చార్జిగా నియమించిన జాతీయ అధ్యక్షులు జంగిటి శ్రీనివాస్, జాతీయ ఉపాధ్యక్షులు ఏటి అంజనేయులుకు కృతజ్ఞతలు తెలిపారు.



నియామకం పత్రాన్ని అందజేస్తున్న దృశ్యం

# కార్మిక వ్యతిరేక చట్టాలను తిప్పికొట్టండి

**ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి**

**పటాన్‌చెరు, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త**

కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన 4 కార్మిక చట్టాలకు వ్యతిరేకంగా ఫిబ్రవరి 12న చేపట్టనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేసి, కార్మిక వ్యతిరేక చట్టాలను తరిమికొట్టాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి కార్మిక లోకానికి పిలుపునిచ్చారు. ఆదివారం పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని క్యాంపు కార్యాలయంలో నూతన కార్మిక చట్టాలకు వ్యతిరేకంగా కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఏర్పాటు చేసిన సమ్మె సన్నాహక సమావేశానికి ఎమ్మెల్యే జీఎంఆర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ ఆర్థిక రంగానికి వెన్నుముకగా నిలుస్తున్న కార్మిక రంగానికి వెన్నుపోటు పొడుస్తూ కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం 29 పాత కార్మిక చట్టాలను రద్దుచేసి పెట్టుబడిదారులకు అనుకూలంగా నూతనంగా నాలుగు కార్మిక చట్టాలను తీసుకొని రావడం దుర్మార్గం అన్నారు. ప్రధానంగా పారిశ్రామిక సంబంధాల కోడ్ లోని నిబంధనల వల్ల ఉద్యోగ భద్రత దెబ్బతింటుందని, పెద్దసంస్థల్లో కూడా ప్రభుత్వ అనుమతి లేకుండా ఉద్యోగులను తొలగించే అవకాశం పెరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. పని గంటలను పెంచే అవకాశం ఉండడం వల్ల కార్మికుల ఆరోగ్యం, కుటుంబ జీవితం ప్రభావితమవుతుందని తెలిపారు. వచ్చే సంవత్సరం నుండి నుంచి దేశవ్యాప్తంగా కార్మికులపై బలవంతంగా రుద్దుతున్న లేబర్ కోడ్ లు ప్రస్తుత 29 కార్మిక చట్టాల ద్వారా పొందుతున్న కనీస హక్కులను రద్దు కాబోతున్నాయని అన్నారు. న్యాయస్థానాల ద్వారా పొందే హక్కును సైతం నూతన లేబర్ కోడ్స్ నిరాకరిస్తున్నాయని అన్నారు. పాత కార్మిక చట్టాల్లో కనీస వేతనం నిర్ణయించే అంశం కేంద్రం, రాష్ట్రాల ఉమ్మడి అంశంగా ఉందని, నూతన లేబర్ కోడ్ లలో రాష్ట్రాల హక్కులు తొలగించడం బాధాకరమన్నారు. ఇక నుండి కేంద్రం కనీస వేతనాలు నిర్ణయిస్తుందని పేర్కొన్నారు. రాష్ట్రాల పరిధిలో ఉన్న వేతనాలు ఇకపై కేంద్ర ప్రభుత్వ దయా దాక్షిణ్యాలపై ఆధారపడి ఉంటాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఆసియాలోనే అతిపెద్ద పారిశ్రామికవాడగా చెందిన పటాన్ చెరు నియోజకవర్గంలో నూతన చట్టాలు కార్మికుల పాలిట అశనిపాతంగా మారబోతున్నాయని అన్నారు. నూతన కార్మిక చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టబోతున్న సార్వత్రిక సమ్మెలో ప్రతీ కార్మికుడు పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో బిఆర్టియు రాష్ట్ర అధ్యక్షులు రాంబాబు, బిఆర్టియు రాష్ట్ర కార్యదర్శి యాదగిరి యాదవ్, హెచ్ఎంఎస్ రాష్ట్ర కార్యదర్శి ఈశ్వర్ ప్రసాద్, హెచ్ఎంఎస్ రాష్ట్ర కార్యదర్శి కొండా మనోహర్, బిఆర్టియు జిల్లా అధ్యక్షులు శివశంకర్ రావు, సీనియర్ కార్మిక నాయకులు నరేందర్, రవి, రావు, లక్ష్మారెడ్డి, సాంబశివరావు, అశోక్, ఖాజా మొయినుద్దీన్, తదితరులు పాల్గొన్నారు



నినాదాలు చేస్తున్న సిఐటియు నాయకులు

## కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను విడనాడాలి

**సిఐటియూ నాయకుల డిమాండ్**

**కొండపాక, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త :** అమెరికా అధ్యక్షుడు ట్రంఫ్‌కు లొంగిపోయి ప్రధాన మంత్రి మోడీ ప్రభుత్వం చేసుకున్న చికటి ఒప్పందాలను బహిర్గతం చేయాలని సిఐటియూ జిల్లా ఉపాధ్యక్షుడు అమ్ముల బాల్ నర్సయ్య, సిఐటియూ నాయకులు రవీంద్రచారి, కనకచారి డిమాండ్ చేశారు. మంగళవారం రాజీవ్ రహదారిపై వెలికట్ట క్రాస్ రోడ్డువద్ద ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ దిష్టి బొమ్మను వారు దగ్ధం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ బెదిరింపులకు భయపడి పూర్తిగా లొంగిపోవడం సరికాదన్నారు. భారతదేశం యూరోపియన్ యూనియన్ స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందం భారతీయ కార్మికులకు, రైతులకు సామన్య ప్రజలను కష్టలకు మరింత గురిచేయడమే అన్నారు. మోడీ తెచ్చిన నల్ల చట్టలను వెంటనే రద్దు చేయాలనారు. ప్రభుత్వాలు ప్రజలకు మేలు చేసే విధంగా ఉండాలి తప్ప నష్టం కలిగించకూడదని విమర్శించారు. కార్మిక, కర్షక, రైతు వ్యతిరేక విధానాలను కేంద్ర ప్రభుత్వం విడనాడలని కోరారు.

## రాజీవ్ రహదారిపై బారికేడ్లు ఏర్పాటు చేయాలి

**బెజ్జంకి, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త :** మండల పరిధిలోని బెజ్జంకి క్రాసింగ్ గ్రామంలోని రాజీవ్ రహదారిపై బారికేడ్లను ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. మండల కేంద్రానికి అతి సమీపంలోనున్న రాజీవ్ రహదారిపై బెజ్జంకి క్రాసింగ్ ద్వారా అటు కరీంనగర్ వైపు హైదారాబాద్ వైపు అనునిత్యం వాహనాలు రాకపోకలతో రద్దీగా ఉంటుంది. ఈ రోడ్డును నేషనల్ హైవే కావడంతో వాహనాలు అతి వేగంగా ప్రయాణిస్తుంటాయి. ఈ రోడ్డుపై ప్రజలు ప్రమాదాలకుగురై గాయాలపాలవడంతో పాటు ప్రాణాలను సైతం కోల్పోయిన సంఘటనలు ఉన్నాయి. రాత్రి సమయాల్లో కనీసం రోడ్డు దాటడానికి రోడ్డుపై వీధి దీపాలు లేవు. ప్రజలు రాత్రి వేళాల్లో రోడ్డు దాటే సమయంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డుపై వీధి దీపాలను అమర్చి వాహనాల వేగాన్ని నియంత్రించడానికి బారికేడ్లు ఉంచి ప్రయాణీకులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

## చేబర్తిలో ఉచిత పశు వైద్య శిబిరం

మర్కుక్, ఫిబ్రవరి 10 (ప్రభాతవార్త): మండల పరిధిలోని చేబర్తి గ్రామంలో పశుగణాభివృద్ధి సంస్థ మరియు పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరాన్ని పశు వైద్యాధికారి డాక్టర్ శిరీషతో కలిసి స్థానిక సర్పంచ్ ర్యాకం యాదగిరి ప్రారంభించారు. ఈ సందర్భంగా పశువులకు గర్భకోశ వ్యాధి నివారణ చికిత్సలు, గర్భ నిర్ధారణ పరీక్షలు, కృత్రిమ గర్భధారణ సూదులు, దూడలకు నట్టల నివారణ మందులు ఉచితంగా అందించారు. అనంతరం డాక్టర్ శిరీష మాట్లాడుతూ ప్రభుత్వం నిర్వహిస్తున్న ఉచిత పశు వైద్య శిబిరాలను, గోపాలమిత్ర సేవలను రైతులు వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ బొగ్గుట శ్రీకాంత్, డాక్టర్ వినయ్, విఎల్వో భాస్కర్, ఓఎస్ కృష్ణ, గోపాలమిత్ర సూపర్వైజర్ భాస్కర్‌గౌడ్, గోపాలమిత్రలు కిషన్, యాదగిరి, పాడి రైతులు తదితరులు పాల్గొన్నారు.

## డ్రంకెన్ డ్రైవ్ కేసులో ముగ్గురికి జైలుశిక్ష

**సిద్దిపేట అర్బన్, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త :** రోడ్డు ప్రమాదాల నివారణ మద్యం తాగి వాహనాలు నడిపేవారిని కట్టడి చేయడానికి ప్రతి రోజు డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహించడం జరుగుతుందని ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ అన్నారు.మంగళవారం ఆయన మాట్లాడుతూ మద్యం తాగి వాహనం నడిపిన ఇద్దరు వ్యక్తులలో ఒకరికి 5 రోజులు, మరోక వ్యక్తికి 2 రోజుల జైలుశిక్ష విధిస్తూ స్పెషల్ సెకండ్ క్లాస్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కాంతారావు విచారణ చేసి తీర్పునిచ్చినట్లు తెలిపారు. డ్రైవింగ్ లైసెన్స్ లేని వ్యక్తికి రూ. 5 వేల జరిమాన విధించినట్లు తెలిపారు. అలాగే మరో నలుగురికి రూ.40 వేల జరిమానా విధించినట్లు తెలిపారు.డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులో పట్టుబడిన వారిని కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి విచారణ జరిపి రూ.10 వేల జరిమానా విధించడం జరుగుతుందన్నారు. మద్యం సేవించి వాహనం నడపరాదన్నారు. బీహార్ రాష్ట్రానికి చెందిన లారీ డ్రైవర్ మితలేష్‌కుమార్(32) కు 5రోజుల జైలు శిక్ష, సిద్దిపేట పట్టణంలోని కాళ్లకుంట కాలనీకి చెందిన గోసిక నారాయణ(45) 2 రోజుల జైలు శిక్ష విధించడం జరిగిందన్నారు. లైసెన్స్ లేకుండా,మద్యం సేవించి వాహనం నడపరాద్దన్నారు.



మొరం వేసి గుంతలను పూడ్చి వేయిస్తున్న సర్పంచ్ సుమతీశివకుమార్

## రోడ్డును బాగు చేయించిన సర్పంచ్

**నర్సాపూర్, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త:** మండల పరిధిలోని నాగులపల్లి కి వెళ్లే బీటీరోడ్డు గుంతలమయంగా మారడంతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రజలు పడుతున్న ఇబ్బందుల విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచ్ సుమతి శివకుమార్ ఆధ్వర్యంలో సొంత నిధులతో మంగళవారం జెసిబిలతో రోడ్డుపై ఏర్పడిన గుంతలను మొరంతో పూడ్చి వేశారు. దీంతో గ్రామస్తులకు ప్రయాణికుల ఇబ్బందులను తొలగిపోయాయి. ఈ మేరకు సర్పంచ్ సుమతీ శివకుమార్ తన స్వంత నిధులతో రోడ్డు బాగు చేయించడం పట్ల గ్రామ ప్రజలు, ప్రయాణికులు హర్షం వ్యం చేస్తు గ్రామ సర్పంచ్ సుమతీ శివకుమార్ కు కృతజ్ఞతలు తెలిపారు.

## ఇసుక అక్రమ తవ్వకాలు నిలపాలంటూ ఆందోళన





ఇసుక తవ్వకాలను నిరసిస్తు ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

**వెల్దుర్తి, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త:** మండలంలోని హస్తాల్‌పూర్ గ్రామంలో ఇసుక అక్రమ తవ్వకాలు నడుస్తున్నాయని దీనిపై అధికారులు చర్యలు తీసుకోవాలని నిరసిస్తూ గ్రామస్తులు మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. హల్దీవాగుతో పాటు పరిసర ప్రాంతాల నుండి ఇసుక తవ్వకాలు జోరుగా నడుస్తున్నా అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు వెల్దుర్తి, తుఫాన్ ఆర్టీసీ బస్సు ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ విషయం తెలుసుకున్న శ్రీనివాస్ గ్రామ సర్పంచ్ నరసింహారెడ్డి నిరసనగా చేస్తున్న వారివద్దకు చేరుకొని వారిని శాంతింపచేశారు. ఇసుక తవ్వకాలు నిర్వహిస్తున్న బడా నాయకులను అధికారులు తక్షణమే గుర్తించి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.

## ఆత్మగౌరవ సభను విజయవంతం చేద్దాం

**తెలంగాణ జాగృతి జిల్లా నాయకులు వీరప్పగారి రమేష్‌గౌడ్**

**హవేళీఘనపూర్, ఫిబ్రవరి 10,ప్రభాతవార్త:** హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలో ఈనెల 12వ తేదీన తలపెట్టిన తెలంగాణ ఉద్యమకారుల ఆత్మగౌరవ సభను విజయవంతం చేయాలని తెలంగాణ జాగృతి జిల్లా నాయకులు వీరప్పరి రమేష్‌గౌడ్ పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో ఆత్మగౌరవసభలో ఉద్యమకారుల మేధావులు కళాకారులు పాల్గొని తెలంగాణ రాష్ట్రాన్ని సాధనకు ప్రాణాలు ఫణంగా పెట్టి అలుపెరుగని పోరాటం చేసిన ఉద్యమకారులకు ఆత్మగౌరవాన్ని సగర్వంగా చాటిచెప్పేందుకు ఉద్యమ సంఘాలతో కలిసి తెలంగాణ జాగృతి సన్నద మైంది. ఉద్యమకారుడు తెలంగాణ అసలైన అస్తిత్వం అన్నారు. ఈనెల 12వ తేదీన జరిగే ఉద్యమకారుల సభకు మేధావులు కులసంఘాలు, ఉద్యమకారులు ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## ఆలయ వార్షికోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే

**పటాన్‌చెరు, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త :**

పటాన్‌చెరు డివిజన్ పరిధి లోని గోకుల్‌నగర్‌లోగల శ్రీరామలింగేశ్వర స్వామి ఐదవ వార్షికోత్సవ కార్య క్రమానికి ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయంలో పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ శంకర్‌యాదవ్, నాయకులు దేవయ్య, మల్లేష్ యాదవ్, ఆలయ కమిటీ సభ్యులు, పుర ప్రముఖులు, తదితరులు పాల్గొన్నారు.

# కనీస పెన్షన్ రూ. 9 వేలు ఇవ్వాలి

**పెన్షనర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నారాయణరెడ్డి**

**పటాన్‌చెరు, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త :**

పెన్షనర్లకు కనీస వేతనం రూ.9 వేలు ఇవ్వాలని పెన్షనర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నారాయణరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆల్ ఇండియా యునైటెడ్ యాక్షన్ కమిటీ ఆఫ్ ఈపి ఎఫ్ పెన్షనర్స్ అసోసియేషన్(ఏఐయుఏసిఈపిఎ) కమిటీ, రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు పోరాట ఎజెండాలో భాగంగా, టిపిఈఆర్‌పిఎ జిల్లా కమిటీ మూడు రోజుల ధర్నా కార్యక్రమంలో భాగంగా రెండవ రోజు జిల్లా కమిటీ సభ్యులతో పాటు ఈపిఎఫ్ పెన్షనర్స్ ఆధ్వర్యంలో మంగళవారం పటాన్‌చెరు పట్టణంలోని భవిష్య నిధి ప్రాంతీయ కార్యాలయం ఎదుట ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ధర్నా నిర్వహించారు. అనంతరం భవిష్యనిధి ప్రాంతీయ కార్యాలయం ఉప కమిషనర్ సురేంద్ర రావుకు వినతిపత్రం అందజేశారు. అనంతరం నారాయణరెడ్డి మాట్లాడుతూ లక్షలాది ఈపీఎఫ్ పెన్షనర్లకు గౌరవప్రదమైన పెన్షన్ ప్రయోజనాన్ని కల్పించడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, పెన్షనర్ల కుటుంబాలు కనీస అవసరాలు తీరక అత్యంత దయనీయ బతుకులు వెల్లదీస్తున్నారని వాపోయారు. పెన్షనర్లు చేస్తున్న విజ్ఞప్తులు, ధర్నాలు,ఉద్యమాలు, ఆందోళనలు కేంద్ర ప్రభుత్వ వైఖరిలో మార్పు రాకపోవడం శోచనీయమన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం ఆలోచించి పెన్షన్ల హింస వేతనం పెంచాలని లేనిపక్షంలో దేశవ్యాప్త ఉద్యమాలు చేపడతామని ఈ సందర్భంగా హెచ్చరించారు. టిపిఈ ఆర్ పిఎ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రామారావు, జిల్లా వైస్ ప్రెసిడెంట్స్ జె. వెంకట రెడ్డి, ఎం. దేవేంద్రా చారి, ఎం సత్యన్నారాయణ పాటి,సెక్రటరీస్ బిఎల్‌నాయుడు, టి.ప్రభాకర రావు, పెన్షనర్‌లు తదితరులు పాల్గొన్నారు.



భవిష్యనిధి ప్రాంతీయ కార్యాలయం ఉపకమిషనర్ సురేంద్రరావుకు వినతిపత్రం అందిస్తున్న పెన్షనర్లు





ఎన్నికల సామగ్రిని తీసుకెళుతున్న ఎన్నికల సిబ్బంది

## మున్సిపల్ ఎన్నికల పోలింగ్‌కు సర్వం సిద్ధం

**15 వార్డులకు 30 పోలింగ్ స్టేషన్ల ఏర్పాటు**

**నర్సాపూర్, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త:** నేడు 11వ తేదీ బుధవారం నర్సాపూర్ మున్సిపల్ పరిధిలో జరిగే ఎన్నికల పోలింగ్‌కు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మున్సిపల్ పరిధిలో నాలుగు జోన్లుగా విభజించి జోన్ ఆఫీసర్లను నియమించినట్లు మున్సిపల్ కమిషనర్ శ్రీరామ్ చరణ్‌రెడ్డి తెలిపారు. నర్సాపూర్ మున్సిపల్ పరిధిలో 15 వార్డులు ఉండగా 30 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పోలింగ్ కేంద్రాలను షాపూర్ పట్టణంలోని ఆరు ప్రాంతాలలో ఏర్పాటు చేశామన్నారు. 1వ పోలింగ్ కేంద్రం హనుమంతపూర్ మండల ప్రాథమిక పాఠశాలలో, 2వ కేంద్రం జగన్నాథరావు కాలనీలోని ఉర్దూ మీడియం రోషిని ప్రాథమిక పాఠశాల, 3వది ప్రభుత్వ జూనియర్ కళాశాలలో, నాలుగవ కేంద్రం నర్సాపూర్ శివాలయం వీధిలోని ప్రాథమిక పాఠశాల, ఐదవ కేంద్రం ఆర్డీవో కార్యాలయం సమీపంలోనున్న బాలుర ప్రాథమిక, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, ఆరవ పోలింగ్ కేంద్రంను మున్సిపల్ కార్యాలయం ఎదుటగల జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎన్నికల నిర్వహణకు 500 మంది సిబ్బందిని ఏర్పాటు చేశామని చెప్పారు. అంతేగాక సీఐ జాన్ రెడ్డి, ఎస్సై రంజిత్ కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేయడం జరుగుతుంది. ఎన్నికలను ప్రశాంతంగా సజావుగా జరగడానికి రాజకీయ పార్టీల నాయకులు, ప్రజలు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ శ్రీరామ్ చరణ్‌రెడ్డి కోరారు.

**ఎన్నికల పోలింగ్ సామాగ్రి పంపిణీ**

పట్టణ సమీపంలోని బివిఆర్ఐటి ఇంజనీరింగ్ కళాశాలలో పోలింగ్ సామాగ్రిని పంపిణీచేశారు.పోలింగ్ నిర్వహణ సిబ్బందికి ఆర్డీవో మహిపాల్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ శ్రీరామ్‌చరణ్‌రెడ్డి పోలింగ్ కేంద్రంలో పాటించవలసిన నియమాలపై సూచనలు చేశారు. అనంతరం ఎన్నికల సిబ్బందికి పోలింగ్ సంబంధించిన వస్తు సామాగ్రిని పంపిణీ చేయగా సిబ్బంది పోలింగ్ వస్తు సామాగ్రి తీసుకొని వారికీ కేటాయించిన వాహనాలో వెళ్లారు.

## ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తున్న అభ్యర్థులు

**సదాశివపేట, ఫిబ్రవరి 10 (ప్రభాతవార్త):** వారం రోజుల నుండి చేస్తున్న ప్రచారం ఒక ఎత్తు అయితే చివరి ఒకరోజు మాత్రం ఓటర్లను ప్రలోభ పెట్టి మద్యం బాటిల్ సప్లైచేస్తూ డబ్బులు పంచుతూ దారికి తెచ్చుకుంటున్నారు. దూర ప్రాంతాలలో ఉన్న ఓటర్లను ప్రత్యేక వాహనాలు పంపి మరి పిలిపించుకుంటున్నారు. ఓటర్లను ప్రసన్నం చేసుకోవడానికి అభ్యరులు ఎంతకైనా దిగజారుచున్నారు. ప్రధాన ప్రత్యర్థులైన బిజెపి టిఆర్ఎస్ కాంగ్రెస్ పార్టీలు గెలుపుపై ఎవరి ధీమా వారు వ్యక్తం చేస్తున్నారు. ప్రజలు మాత్రం ఈసారి యువతకు ఎక్కువ ప్రాధాన్యమిస్తున్నట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులలో కొందరు సీనియర్లపై ప్రజల్లో అసంతృప్తి ఉంది.అది టిఆర్ఎస్ బిజెపి పార్టీలకు కలిసి వస్తుంది. అధికారం చేజిక్కించుకోవడానికి ఏ పార్టీకి పూర్తి మెజార్టీ రాకపోవచ్చునని మేధావులు అంచనా వేస్తున్నారు. ఇండిపెండెంట్ బిజెపి ఎంఐఎం అభ్యర్థులు చైర్మన్ ఎంపికలో కీలకం కావచ్చు. కాంగ్రెస్ పార్టీ చైర్మన్ పీఠంపై అనుకున్నది ఒకటి అయిందొకటి కావచ్చు. కాంగ్రెస్ పార్టీలో ప్రజాధరణ పొందిన నాయకులు కూడా చైర్మన్ పీఠాన్ని ఆశిస్తున్నారు. డబ్బులు అన్ని పార్టీల వద్ద తీసుకుంటున్న ఓటరు తన ఓటు ఎవరికి వేస్తారో తెలియని పరిస్థితిలో అభ్యర్థులు ఉన్నారు. సర్వే ఫలితాలు తమకు అనుకూలంగా ఉన్నాయని భావిస్తున్నప్పటికీ ఏమి జరుగుతుందో అనే టెన్షన్ కూడా అభ్యర్థులలో ఉంది.

## మబ్బుకుంటతండాలో అంగనవాడీ కేంద్రం ప్రారంభం

**అక్కన్నపేట, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త :** మండలంలోని మైసమ్మవాగు తండా గ్రామ పంచాయతీ పరిధిలోని మబ్బుకుంటతండాలో ప్రభుత్వ పాఠశాలలో అంగనవాడి కేంద్రాన్ని గ్రేడ్‌వన్ ఆఫీసర్ తేజస్వినితోపాటు సర్పంచ్ కృష్ణనాయక్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ భూక్య కృష్ణనాయక్ మాట్లాడుతూ అంగనవాడి కేంద్రం ద్వారా చిన్నారులకు పౌష్టికాహారం అందించడంతో పాటు వారి శారీరక, మానసిక పెరుగుదలను నిరంతరం పర్యవేక్షిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ సుజాత, ఉపసర్పంచ్ రాజేందర్‌నాయక్, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## చదువుతోనే మనిషికి సమాజంలో గౌరవం

**కొండపాక, ఫిబ్రవరి 10, ప్రభాతార్త :** చదువుతోనే మనిషికి సమాజంలో విలువ, గౌరవం పెరుగుతుందని సర్పంచ్ శిల్పనర్సింలు, ఉప సర్పంచ్ యెల్లు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం లకుడారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదవ తరగతి విద్యార్థులకు ప్రత్యేకంగా స్టడీ క్లాస్‌లను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మార్చి 14 నుండి 10వ తరగతి వార్షిక రీక్షలు ప్రారంభం కానుండడంతో విద్యార్థులు శ్రద్దతో చదివి ఉత్తమ మార్కులు సాధించి జిల్లాలో మందుండాలనే ఉద్దేశంతో స్టడీ అవర్స్ ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. సాయంత్రం విద్యార్థులు పాఠశాల నుండి వచ్చిన తర్వాత సమయం వృథా చేయకుండా ప్రత్యేక శ్రద్దతో చదువుకోవడానికి అన్ని ఏర్పాట్లు చేసినట్లు వారు తెలిపారు. స్టడీ అవర్స్‌కు 17 విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో వార్డు మెంబర్లు దేవి నర్సింలు, గట్టు చంద్రం, మంకని రాజు, చిరబోయిన సాయిలు, గ్రామస్తులు రాజకొండ బిక్షపతి, పైస విజయ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## మెపా మండల అధ్యక్షుడిగా చింతల పర్శరాములు

**చేర్యాల, ఫిబ్రవరి 10,ప్రభాతవార్త :** ముదిరాజ్ ఎంప్లాయిస్ ప్రొఫెషనల్ అసోసియేషన్ తెలంగాణ(మెపా) మండలాధ్యక్షుడిగా చింతల పర్శరాములు ముదిరాజ్ ఎంపికయ్యారు. మంగళవారం హైదరబాద్‌లో ఏర్పాటు చేసిన మెపా వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్ నుంచి నియామక పత్రాన్ని అందుకున్నట్లు పర్శరాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా చింతల పర్శరాములు మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఈ బాధ్యతలు అప్పగించిన పులి దేవేందర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.అలాగే సహకరించిన జిల్లా అధ్యక్షులు పిట్ల అంజనేయులు,ప్రధాన కార్యదర్శి నాయిని కృష్ణలకు కృతజ్ఞతలు తెలిపారు.అనంతరం పర్శరాములు మాట్లాడుతూ మండలంలోని ముదిరాజ్‌ల ఐక్యత కొరకు కృషి చేస్తానని,ముదిరాజ్‌ల రిజర్వేషన్ల కోసం ప్రభుత్వంపై ఒత్తిడి చేస్తామన్నారు.

## సెంచరీతో కదం తొక్కిన బాకి హిశాంత్

**గజ్వేల్, ఫిబ్రవరి 10 (ప్రభాతవార్త):** సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణానికి చెందిన బాకి స్వామి కుమారుడు బాకి హిశాంత్ సంగారెడ్డిలో జరుగుతున్న అండర్–19 ఇంటర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ టోర్నమెంట్‌లో అత్యుత్తమ ప్రతిభ చాటారు. మెదక్ జిల్లా వర్సెస్ ఖమ్మంతో జరిగిన క్రికెట్ మ్యాచ్‌లో 117 బాల్స్‌లో 106 రన్స్ చేసి శభాష్ అనిపించుకున్నారు. అలాగే మెదక్ వర్సెస్ మహబూబ్‌నగర్‌తో జరిగిన మ్యాచ్‌లో అత్యధికంగా 64 రన్స్ చేసి అందరినీ ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా బాకి హిశాంత్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో గజ్వేల్ పేరును నిలపెడుతానని, ఎక్కడ క్రికెట్ టోర్నీ జరిగినా మంచి ప్రతిభను కనబరుస్తానన్నారు. నన్ను ఆదరిస్తున్న నా క్రికెట్ అభిమానులకు అభినందనలు తెలిపారు. అలాగే గతంలో గజ్వేల్ సిఐగా విధులు నిర్వహించిన సైదా బాకి హిశాంత్‌కు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

## గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యం

**మెదక్, ఫిబ్రవరి 10,ప్రభాతవార్త:** గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైనట్లు ఎస్ఐ నారాయణగౌడ్ తెలిపారు. ఎస్ఐ కథనం ప్రకారం.... చిన్నశంకరంపేట మండలం చందాపూర్ గ్రామ శివారులోని వాగులో గుర్తు తెలియని మహిళ మృతదేహం గుర్తుపట్టలేని స్థితిలో రైతులకు కనిపించడంతో పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందగానే వెంటనే పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహం పూర్తిగా కుళ్లిపోయిందని, ఒంటిపై చీర, జాకెట్, పుస్తెలు మాత్రమే ఉన్నాయని తెలిపారు. గత సంవత్సరం ఆగస్టు నెలలో మనోహరబాద్ మండలం పరికిబండకు చెందిన కవితదిగా మృతదేహాన్ని భావిస్తున్నామని ఎస్ఐ తెలిపారు. ఆగస్టు నెలలో భారీ వర్షాల కారణంగా కవిత వాగులో కొట్టుకుపోయి ఉంటుందని, వాగులో నీళ్ల తక్కువ కావడంతో మృతదేహం బయటపడిందని అన్నారు కుటుంబ సభ్యులకు సమాచారం అందించినట్లు తెలిపారు. గతంలోనే కవిత తప్పిపోయినట్లు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నారాయణగౌడ్ వివరించారు.

## ఝరాసంగంలో ఆర్థిక అక్షరాస్యత ర్యాలీ



ఝరాసంగంలో ఆర్థిక అక్షరాస్యత ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

**ఝరాసంగం, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త:**
మండల కేంద్రమైన ఝరాసంగంలో మంగళవారం రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత వాక్‌థాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లాలో 5రోజుల పాటు ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు సంగారెడ్డి జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ బి.నర్సింగ్‌రావు తెలిపారు. ఝరాసంగంలోని కెనరా బ్యాంక్, డిసిసిబి బ్యాంక్ సిబ్బందితో కలిసి బి.నర్సింగ్‌రావు ప్రజలకు సైబర్ నేరాలపై, ఈ-కెవైసి మోసాల పట్ల అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డిసిసిబి బ్యాంక్ మేనేజర్ రాజు, కెనరా బ్యాంక్ మేనేజర్, సొసైటీ సిఈఓలు నిసార్ అహ్మద్, పిఎస్ఎల్ కో-ఆర్డినేటర్లు రాజశేఖర్, విజయ్‌కుమార్, విద్యార్థులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## వృథాగా మిషన్ భగీరథ నీరు-పట్టించుకోరెవరూ



మిషన్ భగీరథ నీరు పైప్‌లైన్ పగిలి వృథాగా పారుతున్న దృశ్యం

**సిర్గాపూర్, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త:**
మండలపరిధిలోని ఉజలంపాడ్‌లో గత మూడురోజులుగా మిషన్ భగీరథ పైప్‌లైన్ పగిలి తాగునీరు వృథాగా పారతున్నా, పట్టించుకునేవారు కరువవడంతో ప్రజలు అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. పైప్‌లైన్ పగిలి నీరు రోడ్డుపాలవడంతో గ్రామానికి తాగునీరు రాక ప్రజలు తాగునీటి కోసం తహతహలాడుతున్నారు. పైప్‌లైన్ పగిలిపోయిన విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకుపోయినట్లు, పైప్‌లైన్ మరమ్మతు పనులు చేయాలని సూచించినట్లు సర్పంచి పద్మజాసంజీవరెడ్డి తెలిపారు.

## కాంగ్రెస్‌లో చేరిన బిఆర్ఎస్ మాజీ కౌన్సిలర్



ప్రచారం చేస్తున్న బిఆర్ఎస్ మాజీ కౌన్సిలర్ లక్కీ శ్రీనివాస్

**జహీరాబాద్, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త:**
మున్సిపల్ పరిధిలోని 30వ వార్డు బిఆర్ఎస్ మాజీ కౌన్సిలర్ లక్కీ శ్రీనివాస్ సోమవారం బిఆర్ఎస్‌కు రాజీనామా చేసి 30వ వార్డు నుంచి కాంగ్రెస్ అభ్యర్థినిగా పోటీచేస్తున్న పద్మశాలి నాయకురాలు డాక్టర్ నాగజ్యోతికి మద్దతుగా ప్రచారం నిర్వహించారు. జహీరాబాద్ పట్టణంలో పద్మశాలి సంఘం నాయకులుగా ఉన్న డాక్టర్ చంద్రశేఖర్ సతీమణి డాక్టర్ నాగజ్యోతి కాంగ్రెస్ తరపున పోటీచేస్తుండటంతో లక్కీశ్రీనివాస్ బిఆర్ఎస్‌కు రాంరాం పలికి కాంగ్రెస్‌లో చేరి డాక్టర్ నాగజ్యోతికి మద్దతుగా ప్రచారం నిర్వహించారు.

## న్యాల్‌కల్‌లో వీధి స్తంభాలకు విద్యుత్ దీపాలు



వీధి స్తంభాలకు విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయిస్తున్న సర్పంచి

**న్యాల్‌కల్, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త:**
మండల కేంద్రమైన న్యాల్‌కల్ గ్రామంలోని ఆయా వీధులలో ఉన్న విద్యుత్‌స్తంబాలకు విద్యుత్ దీపాలను బిగింపచేయడంతో గ్రామం రాత్రివేళ వెలుతురుతో జిగేలుమంది. మండల కేంద్రమైన న్యాల్‌కల్‌లో గ్రామ సర్పంచి, పంచాయతీ కార్యదర్శి జ్యోతిప్రవీణ్‌కుమార్, శ్రీకాంత్‌రెడ్డిలు గ్రామంలోని విద్యుత్ స్తంభాలకు నూతన విద్యుత్ బల్బులను దగ్గరుండి పంచాయతీ కార్మికులతో ఏర్పాటుచేయించారు. విద్యుత్‌స్తంభాలకు కొత్తగా బల్బులు ఏర్పాటుచేయడంతో గ్రామస్థులు సంతోషం వ్యక్తంచేశారు.

## సిసి రోడ్డు నిర్మాణానికి సర్పంచి శ్రీకారం



సిసి రోడ్డు నిర్మాణానికి శ్రీకారం చుడుతున్న సర్పంచి కోడి గంగారాం

**కల్హేర్, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త:**
మండల కేంద్రమైన కల్హేర్‌లో శ్రీ సాయి విద్యాలయం వెనుకాల సిసి రోడ్డు నిర్మాణం పనులకు మంగళవారం గ్రామ సర్పంచ్ కోడి గంగారాం భూమి పూజా కార్యక్రమాలు నిర్వహించి పనుల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ కోడి గంగారాం మాట్లాడుతూ సర్పంచ్ ఎన్నికల సందర్భంగా చేసిన హామి మేరకు అధికారంలోకి వచ్చిన 50 రోజుల్లోనే హామీని అమలు చేస్తూ గ్రామాభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ మహేష్, వార్డు సభ్యులు అల్లం ఈశ్వర్, జనార్ధన్ గౌడ్, కేశి గొండ, కాంగ్రెస్ నాయకులు శెట్టి మహేంద్ర, నాగరాజు, రాజేశ్వర్ గౌడ్, నారాయణ కొచ్చేరు, మోహన్, కాలనీ వాసులు పండరి గౌడ్, కొచ్చేరు జనార్ధన్, వడ్ల సాయిలు, గైనికాడి అంజగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## దొందూ.. దొందే..

-అభివృద్ధికి పట్టం కట్టండి

-మీడియా సమావేశంలో ఖేడ్

మున్సిపల్ ఎన్నికల ఇంచార్జ్

గజ్జల కాంతం, ఎంపి, ఎమ్మెల్యే



మీడియా సమావేశంలో ఎంపి, ఎమ్మెల్యే తదితరులు

**నారాయణఖేడ్, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త:**
తెలంగాణ రాష్ట్రంలో అధికారంలో పదేళ్లపాటు ఉన్న బిఆర్ఎస్ తెలంగాణను నిలువుగా దోచుకుందని, అలాగే కేంద్రంలో బిజెపి ప్రభుత్వం తెలంగాణకు అడుగడుగున ద్రోహం చేసిందని నారాయణఖేడ్ మున్సిపల్ ఎన్నికల ఇన్చార్జ్ గజ్జల కాంతం, జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్‌కుమార్ షెట్కార్, స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ నారాయణఖేడ్‌తో పాటు అన్ని మున్సిపల్, కార్పొరేషన్‌లలో బిఆర్ ఎస్ పార్టీ కనుమరుగులేకుండా అవుతుందని అన్నారు. నాడు కేంద్రం బిజెపితో అంతర్గతంగా కుమ్ముక్కై రాష్ట్రంలో ప్రజలను నమ్మించి ద్రోహం చేశారని వారు మండిపడ్డారు. ఫలితంగా తెలంగాణ రాష్ట్రం దివాలాతీసే స్థాయికి చేరుకుందని ఆందోళన వ్యక్తంచేశారు. తాము అధికారంలోకి వచ్చిన ప్పటి నుండి అన్నిరంగాల్లో అభివృద్ధిచేసి తాము ముందున్నామన్నారు. కాంగ్రెస్‌ప్రభుత్వం చేస్తున్న సంక్షేమపథకాలు ప్రజలకు తెలుసునని, ఖేడ్‌లో 15వార్డులు కాంగ్రెస్ కైవసం చేసుకోవడం ఖాయం మన్నారు. బిజెపి, బిఆర్ఎస్ పార్టీలది అంతర్గతం గా విడదీయరానిబంధమని, పరస్పరసహకారంతో కోట్లు కొల్లగొట్టారని వారు వ్యాఖ్యానించారు. కెసిఆర్ కుటుం బం లక్షలాదికోట్లు అవినీతికి పాల్పడ్డదని, త్వరలోనే వాళ్ళు జైలుకువెళ్లడం ఖాయమన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో తెలం గాణ రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధిచేసి ముందుకుపోతున్నామన్నారు. రాబోయే రోజుల్లో కూడా కాంగ్రెస్ జెండా ఎగరవేయడం ఖాయమని, మునుముందు ఇంకా అభివృద్ధి తామే చేస్తామ న్నారు. జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు, స్థానిక ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి మాట్లాడుతూ నారా యణఖేడ్ ప్రాంతాన్ని వచ్చే రెండేళ్లలో కనీవినీ ఎరగనిరీతిలో అభివృద్ధిచేసి చూపెడతామన్నారు. అవినీతిరహిత పార్టీ కాంగ్రెస్ అని అన్నారు. రేవంత్‌రెడ్డిని ఒప్పించి, మెప్పించి మరిన్ని నిధులు తెచ్చి పట్టణాన్ని సుందరీకరణ చేసే బాధ్యత మాపై ఉందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర సీనియర్ నాయకులు నగేష్‌కుమార్ షెట్కార్, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు, శ్రీనివాస్ షెట్కార్, రాకేష్ షెట్కార్, నాయకులు తాహర్ అలీ, రషీదు, ఎస్సీ సెల్ అధ్య క్షులు గైని సాయిలు, మాణిక్‌రావుపటేల్, శ్రీనివాస్ రెడ్డి తదితరులున్నారు.

## మున్సిపల్ ఎన్నికల పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి

-ఆర్‌డిఓ, కమిషనర్, తహసీల్దార్



పోలింగ్ సిబ్బందికి సూచనలు చేస్తున్న ఆర్‌డిఓ, కమిషనర్, తహసీల్దార్

**జహీరాబాద్, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త:**
ఈ నెల 11న జహీరాబాద్ మున్సిపల్‌కు జరుగనున్న ఎన్నికలను పురస్కరించుకుని అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆర్‌డిఓ దేవుజా, మున్సిపల్ కమిషనర్ జైత్రాం, తహసీల్దార్ పి.దశరథ్‌లు తెలిపారు. మున్సిపల్ పరిధిలోని 37వార్డులకుగాను 121 పోలింగ్‌కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఒక్కో పోలింగ్‌కేంద్రంలో 5మంది ఎన్నికల సిబ్బందిని కేటాయించామన్నారు. 6మంది రూట్ ఆఫీసర్లు, 6మంది జోనల్ అధికారులు, 26మంది ఆర్ఓలు, ఏఆర్వోలు, ఒక మున్సిపల్ కమిషనర్, ఒక తహసీల్దార్‌లు ఎన్నికల విధులు నిర్వహిస్తారన్నారు. సిబ్బంది అసౌకర్యానికి గురికాకుండా అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామన్నారు. పోలింగ్ ప్రశాంతంగాసాగేలా పట్టణ ఓటర్లు తమ వంతు సహకారం అందించాలని అధికారులు సూచించారు.

## ఎన్నికల నిర్వహణకు సర్వం సిద్ధం

-30 పోలింగ్ కేంద్రాలు, 100మంది సిబ్బంది ఎన్నికల అధికారి జగ్జీవన్




సమావేశంలో మాట్లాడుతున్న ఎన్నికల అధికారి జగ్జీవన్

**నారాయణఖేడ్, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త:**
నారాయణఖేడ్ మున్సిపల్ ఎన్నికలకు సర్వం సిద్ధంచేశామని ఎన్నికల అధికారి జగ్జీవన్ తెలిపారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి 30 పోలింగ్ కేంద్రాలు, 30మంది ప్రెసిడింగ్ ఆఫీసర్స్, 30 ఎపివోలు, 90 ఓపివోలు సిబ్బంది విధులు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. పోలింగ్ అధికారులను ఆయా పోలింగ్‌కేంద్రాలకు తరలించినట్లు తెలిపారు. బుధవారం 7గంటల నుండి 5గంటల వరకు పోలింగ్ జరగనున్నట్లు ఆయన వెల్లడించారు. ఎన్నికల సామగ్రి పంపిణీలో ఎన్నికలసిబ్బంది అధికారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో డిఎస్పి వెంకటరెడ్డి, సిఐలు వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ రావుల శ్రీశైలం, అధికారులు భూమయ్య, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జాతర ఏర్పాట్లను పరిశీలించిన బిజెపి మండలశాఖ అధ్యక్షులు



మాట్లాడుతున్న బిజెపి నాయకులు

**పావన్నపేట, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త:**
ఏడుపాయలకు కెసిఆర్ ఇస్తానన్న రూ.100 కోట్లు ఏమయ్యాయని బిజెపి మండలశాఖ అధ్యక్షులు సంతోష్‌చారి అన్నారు. ఏడుపాయల్లో మంగళవారం జాతర ఏర్పాట్లు పరిశీలించిన ఆయన మాట్లాడుతూ ఏడుపాయలకు రూ.100 కోట్లు ఇస్తానన్న కెసిఆర్ కనుమరుగు అయ్యారని, రూ.35 కోట్లు ఇస్తానన్న ప్రస్తుత సిఎం రేవంత్‌రెడ్డి అసలు పట్టించుకోవడం లేదన్నారు. ఏడుపాయల్లో అందరికీ సరిపోయే పరిస్థితిలో త్రాగునీరు లేదన్నారు. పారిశుధ్యలోపం కనిపిస్తుందని చెప్పారు. స్నానాలు చేయడానికి ఘాట్లు లేవని, ప్రమాదవశాత్తు భక్తులు ఎవరైన నీళ్లలోపడి మరణిస్తే, అందుకు దేవస్థాన అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. మహిళలు బట్టలు మార్చుకునేందుకు గదులు లేవన్నారు. డార్మెటరీలు లేక, చెట్లక్రిందనే సేదతీరాల్సిన పరిస్థితి ఉందన్నారు. పార్కింగ్‌సమస్య ఉందని చెప్పారు. ఆయనవెంట బిజెపినాయకులు దుర్గయ్య, శంకరయ్య, చంద్రయ్య, బాలయ్య, లక్ష్మణావు, నాగభూషణం, గౌస్, వడ్ల చంద్రశేఖర్, రాజు, సంతోష్‌గౌడ్, శ్రావణ్ ఉన్నారు.

## ముదిమాణిక్యం నాగులమ్మ చెరువుకు మరమ్మతులు



ముదిమాణిక్యం నాగులమ్మ చెరువుకు మరమ్మతులు చేస్తున్న దృశ్యం

**పుల్‌కల్, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త:**
ఉమ్మడి పుల్‌కల్ మండల పరిధిలోని ముదిమాణిక్యం గ్రామ శివారులోని నాగులమ్మ చెరువుకు మంగళవారం సర్పంచి పడమటి రమేష్ మరమ్మతు పనులకు శ్రీకారం చుట్టారు. చెరువుకట్టపై పెరిగిన ముళ్లపొదలు, పిచ్చి మొక్కలతో రైతులు, ప్రజలు అటుగా నడిచేందుకు పడుతున్నపాట్లను గమనించిన సర్పంచి హిటాచి సహకారంతో చెట్లను, ముళ్లపొదలను, పిచ్చి మొక్కలను తొలగించి ఆనకట్టను చదును చేయించారు. గత ఖరీఫ్ సీజన్‌లో ఎడతెరిపి లేకుండా కురిసిన భారీవర్షాలకు నాగులమ్మచెరువు ఆనకట్ట మధ్యలో గండి తెగిపోవడంతో చెరువులో చుక్కనీరు లేకుండాపోయింది. ఆనకట్టకు మరమ్మతు పనులు పూర్తయినందున వచ్చే ఖరీఫ్ సీజన్‌లో కురిసే వర్షాలతో చెరువులో నీరు నిల్వ ఉండే అవకాశాలు ఉంటాయని, ఫలితంగా ఆయకట్టు సాగులోకి వస్తుందని సర్పంచి ఆశాభావం వ్యక్తంచేశారు.

## లేబర్‌కోడ్‌లను రద్దు చేయాలి

-ఎంపిడిఓకు సమ్మె నోటీసు

**నాగల్‌గిద్ద, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త:**
కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన కార్మిక వ్యతిరేక లేబర్‌కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని, కార్మికులకు కనీస వేతనం పెంచాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 12న జరిగే సార్వత్రిక సమ్మెలో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని సమ్మెను విజయవంతం చేయాలని సిఐటియు నాయకులు గణపతి అన్నారు. మంగళవారం ఎంపిడిఓకు సిఐటియు నాయకులు ఈ నెల 12న సార్వత్రిక సమ్మెను నిర్వహిస్తున్నట్లు సమ్మె నోటీసును అందచేశారు. సమ్మెలో జిపి, ఆశావర్కర్లు, అంగన్‌వాడీ బాధ్యులు, మిషన్ భగీరథ సభ్యులు పాల్గొని సమ్మెను విజయవంతం చేయాలని గణపతి పేర్కొన్నారు.

## శివరాత్రి ఉత్సవాలకు ఎంపికి ఆహ్వానం..

**నారాయణఖేడ్, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త:**
నారాయణఖేడ్ నియోజకవర్గం ఖేడ్ మున్సిపల్‌లోని జహీరాబాద్ ఎంపి స్వగృహంలో జహీరాబాద్ ఎంపి సురేష్‌కుమార్ శెట్కార్ ఉమ్మడి జిల్లా మాజీ ప్రణాళికాసంఘం సభ్యులు నాగేష్ శెట్కార్, రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రాకేష్ శెట్కార్, పిసిసి సభ్యులు కె.శ్రీనివాస్, బిచ్కుంద మఠం పీఠాధిపతి సోమయ్యప్ప మహాశివరాత్రి సందర్భంగా జాతర కార్యక్రమానికి ఆహ్వానపత్రికను అందించారు. వారితో జగదీష్, మాణిక్‌రావు పటేల్, భాను గౌడ్, సాయిచరణ్, దత్తురెడ్డి తదితరులు ఉన్నారు.

## నేడే మున్సి 'పోల్స్'



వివరాలు తెలుసుకుంటున్న ఎన్నికల అబ్జర్వర్ రవికిరణ్

-రామాయంపేట మున్సిపల్

ఎన్నికల ఏర్పాట్లు పూర్తి

-పోలింగ్ కేంద్రాలకు చేరిన సామగ్రి

-ఎన్నికల ప్రత్యేక అధికారి సాయిబాబా

**రామాయంపేట, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త:**
రామాయంపేట మున్సిపాలిటీ రెండవ సాధారణ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎన్నికల ప్రత్యేక అధికారి సాయిబాబా తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ బుధవారం జరగనున్న రామాయంపేట మున్సిపల్ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకుగాను అన్ని ఏర్పాట్లు ముమ్మరం చేశామన్నారు.

**పోలింగ్ కేంద్రాలకు తరలిన ఎన్నికల సామగ్రి బస్సులు...**
నేడు జరగనున్న ఎన్నికల పోలింగ్ సామగ్రితో సిబ్బంది పోలింగ్ కేంద్రాలకు బయలుదేరి వెళ్లారు. పోలింగ్ సిబ్బందికి సామగ్రి అప్పగించి రూట్ ఆఫీసర్ల ద్వారా ప్రత్యేక వాహనాల్లో సామగ్రిని తరలించారు. పోలింగ్ సామగ్రి బస్సులను అధికారులు జెండా ఊపి పంపించారు.

**12 వార్డులకుగాను 24 పోలింగ్ కేంద్రాల ఏర్పాటు...**
రామాయంపేట మున్సిపల్ ఎన్నికల్లో 12 వార్డులకుగాను 24 పోలింగ్ కేంద్రాలు, 10 ప్రాంతాలలో ఏర్పాటు చేసినట్లు సాయిబాబా తెలిపారు. 12 వార్డులను నాలుగు జోన్లుగా ఏర్పాటు చేసి జోనల్ అధికారి సమక్షంలో పోలింగ్ సామగ్రి తరలించినట్లు తెలిపారు. అంతేకాకుండా పోలింగ్ కేంద్రాల వద్ద సిసి కెమెరాలు ఏర్పాటు చేసి, ఓటర్లకు ఇబ్బంది కలగకుండా సహాయకులను కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు.
బుధవారం జరగబోయే ఎన్నికల కోసం మంగళవారం మధ్యాహ్నం వరకే ఓటర్లకు పోలింగ్ స్లిప్పులు పంపిణీ పూర్తి చేశామని ఆయన తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద మెడికల్ సిబ్బంది అందుబాటులో ఉంటారని, వృద్ధులు, వికలాంగులకు వీల్‌చైర్ సౌకర్యం కూడా ఏర్పాటు చేసినట్లు ఆయన చెప్పారు.

**పోలింగ్ కేంద్రాల వద్ద భారీ బందోబస్తు: సిఐ...**
రామాయంపేటలో బుధవారం జరిగే మున్సిపల్ ఎన్నికల కోసం కట్టుదిట్ట భద్రత ఏర్పాట్లు చేసినట్లు సిఐ వెంకట్‌రాజాగౌడ్ తెలిపారు. పట్టణంలో 180 మంది పోలీస్ సిబ్బందితో బందోబస్తు ఏర్పాట్లు చేశామని, పోలింగ్ కేంద్రాల వద్ద 200 మీటర్ల వరకు బిఎన్ఎస్ఎస్ 163 సెక్షన్ విధించినట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద అభ్యర్థులుగాని, ఇతరులుగాని ఎలాంటి ప్రచారాలు చేయవద్దని సూచించారు. పట్టణంలో ఐదు సమస్యాత్మక కేంద్రాలను గుర్తించామని, ఆకేంద్రాలలో ప్రత్యేక బలగాలను ఏర్పాటు చేస్తామని సిఐ పేర్కొన్నారు.

## పులి సంచరించటం వాస్తవమే

-జాగ్రత్తగా ఉండాలని ఫారెస్ట్ అధికారుల సూచన



పులి తిరిగిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న ఫారెస్ట్ అధికారులు

**అల్లాదుర్గం, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త:**
అల్లాదుర్గం మండలంలో చిరుతపులి సంచరిస్తున్నది వాస్తవమే అని, ప్రజలు జాగ్రత్తగా ఉండాలని శంకరంపేట్ ఫారెస్ట్ సెక్షన్ అధికారి రమేష్ కుమార్ ప్రజలకు సూచించారు. మంగళవారం అటవీశాఖ అధికారులు చిరుతపులి సంచరించిన ప్రదేశాలను పరిశీలించి, పులి ఆనవాళ్లను గుర్తించారు. ఈసందర్భంగా అటుగా ఉన్న తాండవాసులకు అధికారులు పలు సూచనలు చేశారు. గొల్లకుంటతండా సమీపంలో ఉన్న అటవీ ప్రాంతంలో పులి వెళ్లినట్లు అధికారులు గుర్తించారు. తాండవాసులతో పాటు రైతులు, అటుగా తిరిగే ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని పలు జాగ్రత్తలు సూచించారు. మరోమారు చిరుత కానవస్తే సమాచారం అందించాలని అటవీశాఖ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో బీట్ ఆఫీసర్ మనస్విని, సర్పంచి మన్యానాయక్, గ్రామస్థులు పాల్గొన్నారు.

## మౌలికవసతుల కల్పనకే తొలి ప్రాధాన్యత

-భారతీనగర్ డివిజన్‌లో 1కోటి 65లక్షల పనుల ప్రారంభం



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, కార్పొరేటర్

**రామచంద్రాపురం, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త:**
ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుడుతూ భారతీనగర్, రామచంద్రాపురం, పటాన్‌చెరు డివిజన్లను అభివృద్ధికి ప్రతీకలుగా తీర్చిదిద్దుతామని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. భారతీనగర్ డివిజన్ పరిధిలోని ఎల్ఐజి, మ్యాక్‌సొసైటీ కాలనీల్లో 1 కోటి 65లక్షల రూపాయలలో నిర్మించిన సిసి రోడ్డు, ప్రహరీగోడ, కమ్యూనిటీ హాల్‌లను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈసందర్బంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ మూడుడివిజన్‌ల పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని పరిష్కరిస్తూ వస్తున్నామన్నారు. మ్యాక్‌సొసైటీలో బిటిరోడ్డు రెన్యూవల్‌కు సంబంధించి నిధులు మంజూరు అయ్యాయని, డబుల్ రోడ్డు కోసం ప్రతిపాదనలు పంపించామని పేర్కొన్నారు. కార్యక్రమంలో భారతీనగర్ డివిజన్ కార్పొరేటర్ వెన్నవరం సింధు ఆదర్శరెడ్డి, డిప్యూటీ మేయర్ ప్రదీప్‌కుమార్, మాజీ కార్పొరేటర్ తొంట అంజయ్య, డిఈ వెంకటరమణ, నాయకులు పరమేష్‌యాదవ్, ఐలేష్ యాదవ్, కుమార్‌గౌడ్, పెద్దరాజు తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ ఎన్నికలకు భారీ బందోబస్తు

-డిఎస్‌పి సైదానాయక్



పోలీసు సిబ్బందికి సూచనలు చేస్తున్న డిఎస్‌పి సైదా నాయక్

**జహీరాబాద్, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త:**
ఈ నెల 11న జహీరాబాద్ మున్సిపల్ ఎన్నికలను పురస్కరించుకుని ఎన్నికలు ప్రశాంతంగా ముగిసేలా భారీ పోలీసు బందోబస్తును ఏర్పాటు చేసినట్లు డిఎస్‌పి సైదానాయక్ పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని బాగారెడ్డిస్టేడియంలో ఎన్నికల డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలవద్ద విలేకరులతో డిఎస్‌పి మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికలకు 1ఎఎస్‌పి, 1 డిఎస్‌పి, 6మంది సిఐలు, 20మంది ఎస్ఐలు 150మంది సిబ్బందితో బందోబస్తును ఏర్పాటు చేస్తున్నామన్నారు. మొబైల్ టీం పట్టణంలో జరిగే పోలింగ్‌ను పర్యవేక్షిస్తుందన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా ముగిసేలా ప్రతి ఒక్కరు తమ వంతు సహకరించాలని డిఎస్‌పి సూచించారు.

## క్షతగాత్రురాలిని కాపాడిన మెడికవర్ వైద్యులు




క్షతగాత్రురాలికి ఆసుపత్రిలో చేర్చిన మెడికవర్ వైద్యులు

**రామచంద్రాపురం, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త:**
రోడ్డు ప్రమాదాలకు గురైన క్షతగాత్రులకు మొదటిగంట వ్యవధి కీలకమైందని, సరైన సమయంలో చికిత్స నిమిత్తం ఆసుపత్రికి చేర్చి చికిత్స అందిస్తే తీవ్రమైన గాయాలనుంచి ప్రాణాలను కాపాడవచ్చని రామచంద్రాపురం పట్టణం అశోక్‌నగర్‌లోని మెడికవర్ ఆసుపత్రి కన్సల్టెంట్ ట్రామా, జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్ డాక్టర్ ముడవతన శివవర్ధన్‌లు తెలిపారు. ఇస్నాపూర్ ప్రాంతంలో రోడ్డు దాటుతుండగా భారీ వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయాలకు (ఛాతికి, పక్క ఎముకలకు, ఊపిరితుత్తులకు, పొట్టలోని ప్లీహం చీలిపోవడం, నడుము భాగంలోని ఎముకలు విరగడం, కుడితొడ, కాలి ఎముకలు లాంటి గాయాలు) గురైన 58 ఏళ్ల మహిళను మెడికవర్ ఆసుపత్రికి తరలించగా చందానగర్‌లోని వైద్యులు సకాలంలో చికిత్సలు అందించి మహిళ ప్రాణాలను కాపాడారన్నారు. క్షతగాత్రురాలికి డాక్టర్ బర్జీ సాయిదిలీప్, కన్సల్టెంట్ జనరల్, లేజర్, లాపరాస్కోపిక్ సర్జన్‌లు శస్త్రచికిత్సలు అందించారన్నారు. శస్త్రచికిత్స అందుకున్న క్షతగాత్రురాలు ప్రస్తుతం కోలుకుని డిశ్చార్జ్ అయినట్లు డాక్టర్ రాజు తెలిపారు.

## పశువులకు చికిత్స కన్నా నివారణ మిన్న

-రాంతీర్థం పశువైద్య శిబిరంలో పశువైద్యాధికారి గణేశ్

**న్యాల్‌కల్, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త:**
పశువులకు సోకిన రోగాలకు చికిత్సచేయించునే ముందుగానే పశువులు రోగాలబారిన పడకుండా నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలని మండల పశువైద్యాధికారి గణేష్ పాడిరైతులకు సూచించారు. మంగళవారం మండలపరిధిలోని రాంతీర్థంలో జిల్లా పశుగణాభివృద్ధిసంస్థ, పశుసంవర్ధక శాఖల ఆధ్వర్యంలో ఉచిత పశువైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారి గణేశ్ శిబిరానికి చేరుకున్న పశువులకు గర్భస్థ పరీక్షలు, సాధారణ చికిత్సలుచేసి పాడిరైతులకు మందులను అందచేశారు. కార్యక్రమంలో గ్రామసర్పంచి శ్రీనివాస్‌రెడ్డి, ఉపసర్పంచి లక్ష్మమ్మ, గోపాలమిత్ర సూపర్‌వైజర్ తుక్కారెడ్డి, ఎల్ఎస్ఎ రమేష్, విఎ శ్రీనివాస్, గోపాలమిత్ర జనార్ధన్‌రెడ్డి, ధనరాజ్, హుస్సేన్, నాగప్ప, పాడిరైతులు పాల్గొన్నారు.